గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి

మాట్లాడుతున్న మంత్రి స్వామి, చిత్రంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్, ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఒకటో తేదీనే ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. పేదలకు ఒకటో తేదీనే ఇంటి వద్దే పింఛన్ అందజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఈ విషయాన్ని స్పష్టం చేశారన్నారు. అందువల్లే యాభై ఏళ్లకే పింఛను పథకాన్ని గతంలో ప్రారంభించారన్నారు. ట్రైకార్ రుణాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పునరుద్ధరించి గిరిజనుల ఆర్థిక బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఏస్సీకి సిద్ధమయ్యే అయిదు వేల మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతి, శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సంబంధిత శాఖల అధికారులు మరింత శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పోతురాజు కాలువ వెంబడి ఉన్న గృహాల వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకున్నా.. అమ్మేశారు!

- వైకాపా పాలనలో పుట్టగొడుగుల్లా వెంచర్లు
- నిర్మాణాలకు కొనుగోలుదారుల పాట్లు

☛ వెలిగండ్లకు చెందిన మాల్యాద్రి అనే వ్యక్తి... మూడేళ్ల క్రితం కనిగిరి పట్టణ పరిధిలోని పొదిలి రోడ్డులోని ఓ వెంచర్‌లో మూడు సెంట్ల ప్లాట్ కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ఏడు నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా... ఆ లేఅవుట్‌కు అనుమతి లేదని అధికారులు తిరస్కరించారు. ఇప్పటికీ సమస్య కొలిక్కిరాలేదు.

☛ కనిగిరి పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి... పామూరు రోడ్డులో అయిదు సెంట్ల ప్లాట్ తీసుకున్నారు. స్థలానికి రక్షణగా ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా మున్సిపాలిటీ అధికారులు అడ్డుకున్నారు. అప్పటి వరకు కట్టిన గోడను సైతం కూల్చేశారు. ఆ అనధికారిక వెంచర్ వేసింది పలుకుబడి కలిగిన వైకాపా నాయకుడు కావడం గమనార్హం.

– న్యూస్‌టుడే, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు నగరం



కాశిరెడ్డినగర్‌లోని అనధికార లేఅవుట్‌లో అధికారులు కూల్చేసిన ప్రహరీ

గతంలో ఎన్నడూ లేనంతగా వైకాపా అయిదేళ్ల పాలనలో భూ దందాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ, బంజరు, అసైన్డ్, పోరంబోకు, చుక్కలు, దేవాదాయ, పశువుల బీడన్న తేడా లేకుండా ఆక్రమించి... ఎక్కడిక క్కడ అడ్డగోలుగా వెంచర్లు వేశారు. తరువాత ఆయా స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు లభించకపోవడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మధ్య తరగతి వారే కావడం గమనార్హం.

కనిగిరిలో అత్యధికం...

కనిగిరి నియోజకవర్గం పరిధిలో అనుమతి లేకుండా ఏకంగా ఆరు వందలకు పైగా లేఅవుట్లు వేశారు. పరిశ్రమలు వస్తున్నాయని... కనిగిరి, పామూరు; నిమ్జ్ వస్తోందని పీసీపల్లి; వెలిగొండ ప్రాజెక్టు పేరు చెప్పి... వెలిగండ్ల, హనుమంతునిపాడు, సీయస్‌పురం మండలాల్లో ఇష్టానుసారం వెంచర్లు వేశారు. ఈ పరిధిలో దాదాపుగా మూడు వేల ప్లాట్లను సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అంటగట్టి రూ.కోట్లు దండుకున్నారు. ఇప్పుడు ఆయా స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు లభించక కొనుగోలుదారులంతా లబోదిబోమంటున్నారు. పైపెచ్చు ఫిర్యాదులు పస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నాడు అరచేతిలో స్వర్గం చూపి అమ్మకాలకు సాగించిన వైకాపా నాయకులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు.

మార్కాపురంలో అరాచకం...

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో డీటీసీపీ (డైరెక్ట రేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండా 46 లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నియోజకవర్గం పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, గొట్లగట్టు, నాగిరెడ్డిపల్లె, తాడివారిపల్లె, కలుజువ్వలపాడు ప్రాంతాల్లో మరో 15 ఉన్నట్లు తేల్చారు. దర్శి పట్టణం; త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల పరిధిలోనూ పదేసి చొప్పున అక్రమంగా వెంచర్లు వేసినట్లు లెక్క కట్టారు. మార్కాపురం పరిధిలో ఓ తహసీల్దారు... పదవీ విరమణ సమయంలో కొందరు సిబ్బందితో కలిసి ఏకంగా 378.98 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పనంగా కట్టబెట్టారంటే దందాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలో భూ వివాదాలపై ఏర్పాటు చేసిన సిట్‌కు సైతం 30 వరకు ఫిర్యాదులు అందాయి.

కనిగిరి - కందుకూరు రోడ్డులో అనుమతి లేని వెంచర్

మార్కాపురం - కొండేపల్లి రహదారిలో ఓ అనధికార లేఅవుట్

కనిగిరి-పొదిలి రోడ్డులో అమాయకులకు అంటగట్టిన ప్లాట్లు

నగరంలో 35 అనధికారికం...

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోనూ పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలిశాయి. వాటిలో పెద్ద ఎత్తున ప్లాట్లు విక్రయించారు. నియంత్రించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. నిబంధన ప్రకారం అనధికారిక లేఅవుట్లలో హద్దురాళ్లు తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోలేదు. వైకాపా పాలనలో మొత్తం 325 అనధికారిక లే అవుట్లు వేసినట్లు గుర్తించారు. వాటిలో రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమాచారం ఇవ్వడంతో... కొందరు యజమానులు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారు. ఇంకా 35 అనధికారిక వెంచర్లు కొనసాగుతున్నాయి.

అన్ని వివరాలు సరిచూడాలి...

ఇప్పటికే జిల్లాలో అనధికారిక లే అవుట్ల గుర్తింపు ప్రక్రియను అధికారులు దాదాపుగా పూర్తిచేశారు. వీటిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా వెంచర్లలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు స్థలాలు కొనుగోలు చేసే సమయంలోనే సంబంధిత సంస్థల అనుమతులు ఉన్నాయోలేవో సరిచూసుకోవాలని కనిగిరి ఆర్డీవో పి.జాన్‌ఇర్విన్ సూచించారు. లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని తెలిపారు.

ఘాట్ రోడ్డు... ప్రయాణం నరకప్రాయం

- దారుణ స్థితిలో సీమాంధ్రను కలిపే రహదారి
- మల్లన్న భక్తులకూ తప్పని అవస్థలు

న్యూస్‌టుడే – పెద్దదోర్నాల

కర్నూలు-గుంటూరు రహదారి... శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లేందుకు ఈ దారే ప్రధాన ఆధారం. సీమాంధ్రను కలపడంతో పాటు... కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది ఇలానే వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్య మార్గం పూర్తిగా చిద్రమై రాకపోకలకు వీల్లేని విధంగా తయారైంది. గత పాలకులు కనీస నిర్వహణనూ పట్టించుకోక సమస్య జటిలమైంది. పండగల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు విన్నవిస్తున్నారు.

15 కి.మీ.లు అస్తవ్యస్తం...

ఈ రహదారిలో పెద్దదోర్నాల నుంచి నంద్యాల జిల్లా ఆత్మకూరు మధ్య 40 కి.మీ. మేర నల్లమల అడవిలో విస్తరించి ఉంది. ఎత్తయిన కొండలు, లోయలతో కూడిన ఈ మార్గం... 3.6 మీటర్ల వెడల్పు, ఇరువైపులా ఒక్కో మీటరు అంచు కలిగి ఉంటుంది. ఈ పరిధిలో లోతట్టులో ఉన్న 15 కి.మీ.ల ఘాట్ రోడ్డు పూర్తిగా చిద్రమైంది. గత అయిదేళ్లుగా కనీస నిర్వహణ లేక దారంతా గుంతలమయంగా మారి, కోతకు గురైంది. ప్రస్తుత వర్షాలకు పరిస్థితి మరింత దిగజారి ఎదురెదురు వాహనాలు తప్పుకొనే పరిస్థితి ఉండడం లేదు. ఏ మాత్రం ఆదమరచినా అంచుల వెంబడి ఉన్న మట్టిలో చక్రాలు కూరుకుపోయి వాహనం ఆగిపోతుంది. ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోతుంది. చరవాణి సిగ్నళ్లు లేక పోలీసులకూ సమాచారం ఇవ్వలేని దుస్థితి. దీంతో అరణ్యంలో గంటల కొద్దీ సమయం ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. భారీ వర్షాల సమయంలో ఈ మార్గంలోని నాలుగు వాగులు పొంగి మరిన్ని సమస్యలు తప్పడం లేదు.

> "ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీశైలం ఒకటి. దసరా ఉత్సవాలు, కార్తిక మాసం, సంక్రాంతి వేడుకలు, శివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆరు నెలలూ భక్తుల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. వెంటనే పనులు చేపడితేనే ప్రయోజనం ఉంటుంది. ఈ విషయమై జాతీయ రహదారుల సంస్థ జేఈ నాగస్వామి మాట్లాడుతూ... మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

గుంతలతో అధ్వానంగా...

గత ప్రభుత్వ నిర్లక్ష్యం...

కర్నూలు నుంచి పెద్దదోర్నాల వరకు 124 కి.మీ. మేర మార్గం జాతీయ రహదారి-340సి లో ఉంది. ఇందులో 73 కి.మీ.ను రూ.1,200 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. అటవీశాఖ అనుమతులు లేక మిగిలిన 51 కి.మీ. విస్తరణకు నోచుకోవడంలేదు. నల్లమలలో పది మీటర్ల మేరకైనా విస్తరించేలా 2016లో సర్వే చేపట్టారు. ఏడు మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు... ఇరువైపులా 1.5 మీటర్లు చొప్పున ఫుట్ పాత్ నిర్మాణానికి నిర్ణయించారు. కొన్ని చోట్ల రెండు కొండల మధ్య అయిదు మీటర్ల విస్తరణకే అవకాశం ఉండడంతో అంతమేరకే పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు వీటిని అటకెక్కించింది. ఈ పనులకు దిల్లీలోని అటవీశాఖ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు అవసరం. ముఖ్యమంత్రి స్థాయిలో జోక్యం చేసుకుంటే తప్ప ఇవి రావు. అయిదేళ్ల కాలంలో జగన్ సర్కారు ఆ దిశగా ఒక్క అడుగూ వేసిన దాఖలాలు లేవు.

మోట్ల మల్లికార్జునపురం మూలమలుపు వద్ద లారీ బోల్తా (పాత చిత్రం)

వణికిస్తున్న జ్వరాలు

- 40 రోజుల్లో 85 వేల కేసుల నమోదు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



ఓపీ కోసం ఒంగోలు జీజీహెచ్‌లో బారులు

జిల్లాలో జ్వరం కేసులు బెంబేలెత్తిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే... గత నలభై రోజులుగా రోజుకు సగటున రెండు వేల మంది బాధితులు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వాస్తవంలో ఈ సంఖ్య మరింత ఉంటుందన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం సంతనూతలపాడుకు చెందిన ఓ బాలిక, పేర్నమిట్టకు చెందిన మరో వ్యక్తి జ్వరం లక్షణాలతో మృత్యువాతపడడం సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక సర్వే నిర్వహించి అవసరమైనవారికి తక్షణ వైద్యసేవ లందించాలని... కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్య శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలిచ్చారు.



(డెంగీ లక్షణాలతో వంద మందికి పైగా బాధితులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినట్లు అంచనా)

తీవ్రమైన ఒళ్లు నొప్పులు...

బుధవారం నుంచి జిల్లాలో ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు... గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కువ మంది తీవ్రమైన ఒళ్లు నొప్పులు, నిస్సత్తువ, ఒక్కసారిగా శరీర ఉష్ణోగ్రతలు పెరగడం వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఇవి వైరస్ వల్ల తలెత్తే జ్వర లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాలు, వాతావరణం మారడం... పారిశుద్ధ్య సమస్య ఉన్నచోట దోమల కారణంగానూ సమస్య తలెత్తే అవకాశం ఉందని వివరిస్తున్నారు. దాదాపుగా ప్రతి ఇంటిలోనూ కనీసం ఒకరిద్దరు పీడితులు ఉన్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్లేట్‌లెట్‌లు పడిపోవడం వంటి సమస్యలు తలెత్తిన వారు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. వీరి వివరాలు అధికారిక లెక్కల్లో నమోదు కావడం లేదు.

జీజీహెచ్‌లో ఉచితంగా ప్లేట్‌లెట్స్...

ఏటా వర్షాకాలంలో జ్వరాలు రావడం సహజమే అయినా... ఎక్కువగా టైఫాయిడ్, డెంగీ కేసులు వెలుగు చూస్తుండడం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. దస్త్రాల ప్రకారం గత నలభై రోజుల్లో ఎనిమిది డెంగీ కేసులు నమోదైనా... ఈ లక్షణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారు వందకు పైగా ఉంటారని అంచనా. వైరల్ జ్వరాలు సైతం గన్యాకు దారితీస్తున్నాయని... ఇలాంటి కేసులు పదుల సంఖ్యలో నమోదవుతున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ... ఎవరికైనా రెండుమూడు రోజుల పాటు జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నిల్వ ఉన్న ఆహారం కాకుండా వేడిగా ఉన్నది తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. డెంగీ వల్ల ప్లేట్‌లెట్స్ తగ్గిన వారికి ఒంగోలు సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఉచితంగా ప్లేట్ లెట్స్ ఎక్కిస్తున్నట్లు వివరించారు.

వరద బాధితులకు అన్నివిధాలా అండ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'గతంలో ఎవరూ చేయని విధంగా వరద బాధితులకు కూటమి ప్రభుత్వం సాయం అందించింది. వారంతా సంతోషంగా ఉన్నారు. ఇది చూసి బ్లూ మీడియా కుళ్లుకుని... లేనిపోని ఆపోహాలు ప్రచారం చేస్తోంద'ని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. ఒంగోలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా నిలిచామని... ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు సైతం ఈ విషయంలో కొనియాడారని తెలిపారు. బాధితులకు వైకాపా వారు రూ.కోటి ఇస్తామన్నారు... ఎవరికి ఇచ్చారో తెలపాలని సవాలు విసిరారు. మూడు రోజుల పాటు తిరిగారని... ఎవరికీ పైసా సాయం చేసింది లేదని ఎద్దేవా చేశారు. ప్రకాశం బ్యారేజీని పగలగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

మహాత్ముడే మార్గదర్శి...!

కనిగిరిలోని ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్ముడి విగ్రహమిది. మొన్నటి వరకు విగ్రహం కొంతమేర దెబ్బతిని, ఆ ప్రాంగణం సైతం రంగువెలిసి అధ్వానంగా ఉండేది. పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డులో 'బాబాయ్ హోటల్' పేరిట చిన్న అల్పాహార దుకాణం నిర్వహించే అంబటి శ్రీనివాసరెడ్డి... ఆ దుస్థితి చూసి ఆవేదన చెందారు. గాంధీ మార్గాన్ని ఇష్టపడే ఆయన... దెబ్బతిన్న విగ్రహానికి, మందిరానికి బేల్దారీ మేస్త్రీలతో మరమ్మతులు చేయించారు. రంగులు వేయించి ఇలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం రూ.పది వేలకు పైగా ఖర్చు చేశారు. అభిమానంతోనే ఈ పనులు చేయించానని... గాంధీ జయంతి (అక్టోబరు 2) ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. – న్యూస్‌టుడే, కనిగిరి

పేదల ఇళ్ల బిల్లులకు మోక్షం

- జిల్లాలో 23,489 మంది లబ్ధిదారులు
- చెల్లించనున్న మొత్తం రూ.48.15 కోట్లు

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం

తెదేపా హయాంలో నిర్మించారన్న అక్కసుతో గత వైకాపా ప్రభుత్వం పేద గృహ లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. బిల్లులు చెల్లించకుండా అయిదేళ్లు ముప్పుతిప్పలు పెట్టింది. తాజాగా... వారందరికీ బిల్లులు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో బడుగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కొత్తపట్నం మండలం అల్లూరులో లబ్ధిదారు వివరాలు నమోదు చేస్తున్న గృహ నిర్మాణశాఖ అధికారులు

ఇదీ విషయం...: సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకున్నవారికి 2014-19 మధ్య ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద అప్పటి తెదేపా ప్రభుత్వం లక్షకుపైగా ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు చొప్పున; ఎస్సీ, ఎస్టీలైతే రూ.2.50 లక్షల చొప్పున యూనిట్ విలువగా నిర్ణయించింది. నిర్మాణం పూర్తయ్యే నాటికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. చివరికి జిల్లా వ్యాప్తంగా 23,489 మంది లబ్ధిదారుల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీరికి మొత్తంగా రూ.48.15 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆయా బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ... 2019 సార్వత్రిక ఎన్నికల ప్రకటన రావడంతో నిధుల విడుదలకు బ్రేక్ పడింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వాటిని నిలిపేసి... అయిదేళ్లుగా లబ్ధిదారులకు మొండిచేయి చూపింది.

సర్వే ద్వారా గుర్తింపు...: అప్పట్లో అప్పులు తెచ్చి పనులు పూర్తిచేసిన వారు నానా అవస్థలు పడ్డారు. గృహనిర్మాణశాఖ కార్యాలయాల చుట్టూ పేదలు, బడుగులు తిరిగినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని విన్నవించినా కనికరించలేదు. తాజాగా... కూటమి ప్రభుత్వం అప్పటి గృహాలకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఆదేశాల మేరకు గృహనిర్మాణ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇళ్లు ఏ దశలో ఉన్నాయో యాప్‌లో నమోదు చేయాలని ఉత్తర్వులిచ్చారు. త్వరలోనే వారందరికీ బిల్లులు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పరిశీలిస్తున్నారు. గుంతలు, పునాది దశలో ఉన్న గృహాలను పీఎంఏవై-2.0లో అనుమతి ఇచ్చి పూర్తి చేయించాలని నిర్ణయించారు.

2014-19 మధ్య పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, బిల్లుల వివరాలు...

నియోజకవర్గం	వివిధ దశల్లో ఉన్న గృహాలు	పూర్తయినవి	చెల్లించాల్సిన బకాయిలు (రూ.కోట్లల్లో)
గిద్దలూరు	3601	593	7.10
కనిగిరి	3150	604	7.61
దర్శి	3156	591	6.40
కొండపి	3449	794	8.83
యర్రగొండపాలెం	3443	716	7.55
మార్కాపురం	2673	899	4.75
సంతనూతలపాడు	2897	96	3.70
ఒంగోలు	1120	167	2.18

(c) eenadu

ఊరికి ఉపకారి.. బడికి హితకారి

దాతృత్వమూర్తి తిరుపతిరావు రూ.కోటితో వసతుల కల్పన

ఓనమాలు దిద్దిన బడి.. జన్మనిచ్చిన ఊరును ఆయన విస్మరించ లేదు. వాటి ఉన్నతికి నిత్యం శ్రమించారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నా తన వారి కోసం పరితపించారు. కోటి రూపా యలు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ఇలా విద్యార్థుల, గ్రామస్థుల కష్టాలు దూరం చేశారు కనిగిరి మండలం మిట్టమీదప ల్లికి చెందిన పూర్వ విద్యార్థి నాదెళ్ల తిరుపతిరావు.

న్యూస్‌టుడే, కనిగిరి :

హైదరాబాద్‌తో స్థిరపడిన ప్రముఖ పారిశ్రామికవేత్త నాదెళ్ల తిరుపతిరావు సొంతూరు మిట్టమీదపల్లి. నలభై ఏళ్ల క్రితం గురవాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్‌లో వ్యాపారవేత్తగా స్థిర పడ్డారు. ఓ సారి పాఠశాలను సందర్శించగా, అక్కడ వస తుల లేమి ఆయన్ను వేదనకు గురిచేసింది. తన తోటి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించి గత పదేళ్లుగా పాఠశాలలో వసతుల కల్పనకు రూ. 50 లక్షలు వెచ్చించారు.

పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

మురిసిన చదువుల తల్లి..

గురవాజీపేట పాఠశాలకు రూ. 3 లక్షలతో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయించారు. మరో రూ. 3 లక్షలతో ఇనుప బెంచీలు అందజేశారు. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు. విద్యార్థులకు నెలకు రెండుసార్లు నాణ్యమైన మాంసాహార భోజనం సమ కూరుస్తున్నారు. డిజిటల్ తెరను ఏర్పాటు చేయించారు. రూ.4 లక్షలతో శుద్ధి జల ప్లాంట్ నెలకొల్పారు. విద్యార్థు లకు ఉచిత బస్‌పాస్‌లు సైతం సమకూరుస్తున్నారు.

పాఠశాలలో నెలకొల్పిన డిజిటల్ తెర వద్ద విద్యార్థుల చదువులు

గ్రామ వికాసానికి..

అయిదేళ్లుగా గురవాజీపేట పంచాయతీలోని చాగంరెడ్డిపల్లి, మిట్ట మీదపల్లి, గురవాజీపేట ఎస్సీ కాలనీలో ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు రూ.20 లక్షలు ఖర్చుచేశారు. గురవాజీపేట పీహెచ్‌సీకి కోసం రూ. 3 లక్షలతో ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ సామగ్రి అందజేశారు. పశు వైద్యశాలకు రూ. 1.20 లక్షలతో వసతులు సమకూర్చారు. గ్రామంలో మొక్కల పెంపకం ఇతరత్రా వసతులు కోసం నిధులు వెచ్చించారు. రూ. 15 లక్షలతో ముస్లింల కోసం పీర్లచావిడి నిర్మించారు. ఇటు పాఠశాలకు, అటు గ్రామానికి నిధులు వెచ్చించి సౌక ర్యాలు కల్పించడం ఎంతో సంతృప్తినిచ్చిందని, ఇదే ఒరవడిని కొన సాగిస్తానని నాదెళ్ల తిరుపతిరావు చెబుతున్నారు.

దివ్యాంగుని పెద్ద మనస్సు

విరాళాలు సేకరించిన తెదేపా నాయకుడు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: దివ్యాం గుడైన తెదేపా నాయకుడు వరద బాధితులకు అండగా నిలిచారు. సీతారాంపురానికి చెందిన గ్రామ తెదేపా అధ్యక్షుడు సానికొమ్ము వెంకటే శ్వరరెడ్డి కష్టనష్టాల కోర్చి బంధువులు, స్నేహి తుల నుంచి రూ.1 లక్ష మేర విరాళాలు సేక రించారు. ఈ మేరకు నగదుతో పాటు దాతల వివరాలను ఆదివారం మండల తెదేపా అధ్య క్షుడు ఎస్.తిరుపతిరెడ్డికి అందజేశారు. తన సొంత నిధులకు దాతలందించిన నగదు జోడిం చానన్నారు. ఆయన కృషిని గ్రామస్థులు కొని యాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కందుల వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి తోపాటు గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నగదు, వివరాల పత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఎక్సైజ్ శాఖలో అధికారుల నియామకాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్సైజ్‌శాఖలో పలువురు అధికారులను నియమిస్తూ ఆ శాఖ డైరక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇన్‌స్పెక్టర్లతో పాటు జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను నియమించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఇటీవల ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంతో వారిని కూడా కలుపుకుని జిల్లాలోని స్టేషన్లకు అధికారుల నియమించారు. కొత్త వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.లీనా (ఒంగోలు), ఎం.సుకన్య (చీమకుర్తి), ఎం.శివకుమారి (సింగరాయకొండ), టి.అరుణకుమారి (పొదిలి), కె.శ్రీనివాసరావు (దర్శి), ఎం.వెంకటరెడ్డి (మార్కాపురం), ఆర్.విజయభాస్కరరావు (కనిగిరి), ఎం.జయ రావు (గిద్దలూరు), ఎస్.కొండారెడ్డి (కంభం), సి.హెచ్.శ్రీనివాసులు (యర్రగొండపాలెం) నియమితుల య్యారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా బి.ఈశ్వరరావును నియమించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమి షనర్లుగా ఎస్.రామారావు, ఆర్.నరహరిరావులను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ డైరక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని ఐ.ఎం.ఎల్ డిపో ఇన్‌ఛార్జిగా పి.వి.శేషయ్యను నియమించారు.

హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

పొదిలిలో 22 ఎకరాలు స్వాధీనం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలం కాటూరివారిపాలెం సమీపంలోని ఒంగోలు-పొదిలి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైకోర్టు ఆదే శాల మేరకు కనిగిరి ఆర్డీవో పి.జాన్ ఇర్విన్ తొలగింపజేశారు. ఆదివారం పొదిలి తహసీ ల్దార్ ఎం.వి.కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారుల బృందం అక్కడకు చేరుకుని పిల్లర్లు తొలగింప జేశారు. ఆర్డీవో తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండ దేసింగరావు, అతని కుటుంబ సభ్యులు తప్పుడు పత్రాలు సృష్టించి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిం చారన్నారు. సర్వే నెంబర్లు 687/1, 1307/2, 1308/4, 1309/3,4, 1310/1,2,4, 1311/2లలో 22.84 ఎకరాలు కబ్జా చేసి గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై గత కొన్నేళ్లుగా న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. తాజాగా హైకోర్టు అది ప్రభుత్వ భూమిగా పరి గణించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు రావడంతో వాటిని అమలుచేసినట్లు చెప్పారు. ఆ స్థలంలో వేసిన కాంక్రీటు పిల్లర్లు జేసీబీ సాయంతో తొలగించామన్నారు. ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటుచేసి ఇతరులెవరు ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు చెప్పారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పొదిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పొదిలి తహసీల్దార్ ఎం.వి.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో సురేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో వేసిన కాంక్రీటు పిల్లర్లను కూల్చి వేస్తున్న దృశ్యం

మద్దిపాడుకు వెంకన్న పాదయాత్ర

మద్దిపాడు, న్యూస్‌టుడే: భద్రా చలం రామన్న ఆలయం నుంచి తిరు పతి వెంకన్న సన్నిధికి చేపట్టిన పాద యాత్ర శనివారం మద్దిపాడుకు చేరింది. 'అందరూ బాగుం డాలి..అందులో మన ముండాలి' అన్న భావనతో త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ఈ నెల 19న భద్రాద్రిలో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ భద్రాచలం నుంచి వెంకన్న సన్నిధికి పాదయాత్ర వరుసగా ఏడు లీపు సంవత్సరాల్లో చేయ సంకల్పించామన్నారు. ఇప్పటికే ఆరు పర్యాయాలు యాత్ర చేశామని. చివరిదైన ఏడో పాద యాత్రను ప్రస్తుతం కొనసాగిస్తున్నామన్నారు. లోక కల్యాణార్థం చేపట్టామని ఆయన చెప్పారు.

భద్రాద్రి రామన్న- తిరుమల వెంకన్న పాదయాత్రలో పాల్గొన్న త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బంది

పాఠశాల విద్య అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పద్మకుమారి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యా సర్వీసెస్ అసోసియే షన్ రాష్ట్ర నూతన కమి టీని ఆదివారం విజయవా డలో జరిగిన సమావే శంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న బి.పద్మకుమారి, గౌరవాధ్యక్షునిగా అడగా స్వాములు, ఉపాధ్యక్షునిగా ఎన్.బాలాజీలు ఎన్నికయ్యారు. ఈ ముగ్గురు జిల్లాకు చెందిన వారు. విద్యాశాఖలో ఉద్యోగోన్నతులు కల్పించాల్సిన విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతా మని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర నూతన కమిటి సమావేశంలో తీర్మానం చేశామన్నారు.

నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

కబ్జా గుప్పిట్లో.. దాతల భూములు

ఆక్రమణల్లో కుంటలు.. చెరువులు

గ్రామాల్లో నీటి అవసరాలు తీర్చాలన్న సదాశయంతో దాత లందించిన భూములు కబ్జా గుప్పిట్లో చిక్కుకుంటున్నాయి. నీటి అవసరాలు తీర్చే నిమిత్తం కుంటలు, చెరువుల ఏర్పాటు కోసం వారు అందించిన భూముల్లో నేడు అక్రమార్కులు తిష్ఠ వేశారు. దీంతో అవి నానాటికీ కుంచించుకుపోతున్నాయి.

కుంచించుకుపోయిన పాపరాజు కుంట

న్యూస్‌టుడే, మద్దిపాడు, సంతనూతలపాడు :

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నీటి వనరులు కబ్జాల్లో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్దిపాడు మండలంలోని రాచ వారిపాలెం- నాగన్నపాలెం రహదారిలో కడియాల వారి చెరువు కోసం దాతలు దాదాపు ఎనిమిది ఎకరాల భూమి ఇవ్వగా, దాదాపు మూడె కరాలు కబ్జాకు గురైంది. కీర్తిపాడు సర్వే నెం 72లో పాపరాజుకుంట ఏడెకరాల 20 సెంట్ల విస్తీర్ణంలో ఉండేది. అందులో కొంత భూమి కొందరికి పునరావాసం కింద ఇవ్వగా, మిగతా భూమి ఆక్రమణకు గురైంది. మద్దిపాడు మండల కేంద్రంలోని సర్వే నెం 201, 202లో మొత్తం అయిదెకరాల 17 సెంట్లలో ఉన్న ఆదెన్న చెరువు వేలమంది దాహార్తి తీర్చేది. ఇది కూడా ఆక్రమణల్లో చిక్కింది.

పేరుకే రెండొందల ఎకరాలు..

జిల్లా కేంద్రానికి శివారులో ఉన్న పేర్నమిట్ట సుమారు రెండొందల ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. గత అయిదేళ్లుగా వైకాపా పాలకులు నిర్వహణ విస్మరించడంతో ఆక్రమణదారులు పేట్రేగారు. మరోవైపు పూర్తిగా చిల్ల, రబ్బరు చెట్లతో అధ్వా నంగా మారింది. ఇష్టానుసారంగా అక్రమ మట్టి రవాణాతో చెరువు గర్భం చిద్రమైంది. చెరువును యథేచ్ఛగా ఆక్రమించి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్ల, రబ్బరు చెట్లతో దర్శనమిస్తున్న పేర్నమిట్ట చెరువు

సాగు చేసుకుంటున్నా చర్యలు లేవు. చెరువు కట్టపై ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. ఇవి ఏటికేడు పెరుగుతున్నా నిలువ రించే దిశగా అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం. సాగర్ నీరు నేరుగా చెరువుకు వచ్చే అవకాశముంది. ఇందులో వంద ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేసి శివారుతో పాటు ఒంగోలుకు నీరందించా లన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. సర్వే చేసి భూము లను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో ికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

వెలిగొండ సాధనకు మలిదశ పోరాటం

పామూరు, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయాలని మలిదశ పోరాటా నికి సిద్ధమవుతున్నామని, దీనిపై ఉద్యమ రూపకల్పనకు అక్టోబరు 8న మార్కాపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. పామూరులో డీవీ మనోహర్ భవ నంలో శుక్రవారం నుంచి జరుగు తున్న సీపీఐ జిల్లా శిక్షణ తరగతులు మూడోరోజు ఆదివారంతో ముగిశాయి. పాల కుల నిర్లక్ష్యం కారణంగా వెలిగొండ ప్రాజెక్టు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాలేదని ఆవే దన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ కనిగి రిలో నిమ్జ్, పారిశ్రామిక కారిడార్, ఒంగోలు పాల కేంద్రం తదతర సమస్యల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని పేర్కొన్నారు. దీనికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. బౌతికవాదం-భావవాదంపై ఆంధ్ర విశ్వవిద్యా లయం ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస్, కుల మత మూఢ విశ్వాసాలు-వాటి పర్యవ సానం-కమ్యూనిస్టుల అనే అంశంపై సారయ్య మాట్లాడారు.

మాట్లాడుతున్న సీపీఐ నేత ఈశ్వరయ్య. చిత్రంలో పార్టీ నాయకులు

బిందు సేద్యానికి పెద్దపీట

మార్కాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ సంవ త్సరం 30 వేల హెక్టార్లల్లో బిందు సేద్యం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ఆది వారం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు, పలు కంపెనీ లకు చెందిన డీలర్లు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీ, 5 నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న వారికి 70 శాతం రాయితీపై పరికరాలు అందిస్తు న్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 1,207 మంది రైతు లకు చెందిన 1,352 హెక్టార్లల్లో బిందు సేద్యం పరికరాలను

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణ

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర పైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

TO LET

ఒంగోలు, బండ్లమిట్ట లంబాడి వీధిలో గం జాగర్లమూడి సుబ్బారావు కాంప్లెక్స్‌లో I, II, III ఫ్లోర్స్ (3200SFT ఒక్కో ఫ్లోర్) విద్యాసంస్థలకు, బ్యాంకులకు, హాస్టల్స్‌కు, కమర్షియల్స్ ఆఫీసు ఇవ్వబడును. ✆ 9441218690.

EDUCATION

DISTANCE EDUCATION

గీతం డిగ్రీ కాలేజి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆథరైజ్డ్ స్టడీ సెంటర్ నందు B.A, BBA, B.Com, B.LISc, MA (ALL), M.Com, MHRM, MSW కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సెల్: 98491 24970.

JOBS

హైదరాబాద్ స్టార్ హోటల్స్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో బాయ్స్ & గర్ల్స్ కావలెను. రూమ్, ఫుడ్ బస్ పాస్ ఫ్రీ. శాలరీ: 16000-25000. Ph: 9550110629, 8466882075

హర్షేశ్వ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / షేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k ✆ 96405 28899, 96406 48899.

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / షేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18 K. ✆ 85209 80099, 85208 74499.

FINANCIAL SERVICES

స్టాక్ మార్కెట్ బేసిక్స్ & ఇంట్రాడే ట్రేడింగ్ టెక్నికల్ ఎనాలసిస్ నేర్చుకోవాలి అని ఆసక్తి ఉన్నవారు Online & Offline Training కొరకు సంప్రదించగలరు. Ph: 7673915758

FACULTY/ TEACHERS

Wanted Teachers for 1st - 5th Classes at DEEPSIKA PUBLIC SCHOOL, Kakarla. Hostel Facility Available. సెల్: 80746 38228, 63038 12204.

SriVani Nikethan, Karavadi, Ongole(Mdl), Wanted Teachers 1st to 7th std to teach Eng, Maths & Science, P.M. Rs.20,000/- Cont: 9949217836.

REAL ESTATE

LEASE

ఒంగోలు, దొడ్డవరప్పాడు, NH-5 ఆనుకొని, రిసార్ట్ షోరూం దగ్గర, హైవే సైడ్ వెంచర్ ఆనుకొని 75 సెంట్ల భూమి షోరూంలకు, హోటల్స్, గోడౌలకు లీజుకు ఇవ్వబడును. Cont: 9849115524.

CATERING

రాయపూర్ (ఛత్తీస్‌ఘడ్) ఊరులో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాన్ని బట్టి. సంప్రదించండి - 9425203443.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పం దించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిం దిగా పాఠకులకు సూచించడమై నది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందిం చిన సేవల విషయం లో తప్ప, ప్రక టనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమా న్యానికే కలదు.

తప్పిపోయిన చిన్నారులు క్షేమం

మద్దిపాడు, న్యూస్‌టుడే: తప్పిపోయిన చిన్నారులు ఎట్టకేలకు క్షేమంగా అమ్మమ్మ చెంతకు చేరిన సంఘ టన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చిన్నారుల తల్లిదండ్రుల కథనం ప్రకారం..బాతుల మేపు కుంటూ ఉపాధి పొందుతున్న లాజర్ దొడ్డవరప్పాడు వచ్చి అక్కడే పిల్లలతో ఉంటున్నారు. శుక్రవారం ఆయన పనిమీద వేరే ప్రాంతానికి వెళుతూ ఇద్దరు పిల్లలు నాగులూరి మహేష్, భూమికలను ఇంటివద్దే ఉంచారు. ఇంటి పక్కనున్న వ్యక్తికి చూడమని చెప్పి వెళ్లారు. ఆ తర్వాత పిల్లలిద్దరూ రహదారి వెంట కిమ్స్ హాస్పిటల్ సమీపం నుంచి నడిచి వెళ్తుండగా గమనించిన ఆటో చోదకుడు ఎక్కడికి వెళ్లాలని అడిగితే పామూరు అని చెప్పారు. దీంతో ఆటోలో ఎక్కించుకుని సింగరాయకొండ బైపాస్‌లో దింపి రూ. 50 నగదు ఇచ్చి బస్సుకు వెళ్లిపోవాల్సిందిగా చెప్పారు. వారు అక్కడి నుంచి బస్‌లో కందుకూరు చేరుకుని బస్టాండ్‌లో ఉండగా, బంధు వులు గుర్తించి పామూరులోని అమ్మమ్మ చెంతకు చేర్చడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

అమ్మమ్మ వద్ద చిన్నారులు మహేష్, భూమిక

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(భారత ప్రభుత్వరంగ సంస్థ) పామూరు బ్రాంచ్, సత్యనారాయణస్వామి గుడి ఎదురుగా, నెల్లూరు రోడ్డు, పామూరు, ప్రకాశం జిల్లా-523108. టెలిఫోన్ నెం.88861 72119. ఇ-మెయిల్ : ubin0804436@unionbankofindia.com

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (యాక్టు 54/2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు)/ హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1) మెస్సర్స్ శ్రీ బాలాజీ మినరల్స్ (ఋణగ్రహీత), ప్రాపరిధ్యం వహిస్తున్న శ్రీమతి గోను సరళమ్మ & శ్రీమతి పులి వినీల,** ఎస్.నెం.440, మెయిన్ రోడ్డు, రెడ్డిగారిపల్లి, చంద్రశేఖరపురం, ప్రకాశం జిల్లా-523211. **2) శ్రీమతి గోను సరళమ్మ (మేనేజింగ్ పార్ట్‌నర్), భర్త: చంద్రశేఖర్ రెడ్డి,** 2-48, కోవికంపాడు, ప్రకాశం జిల్లా-523112. **3) శ్రీమతి పులి వినీల (పార్ట్‌నర్), తండ్రి: నాగేంద్ర రెడ్డి,** 9-222, పులివెంకటరెడ్డి వారి వీధి, 9వ వార్డు, కనిగిరి, ప్రకాశం జిల్లా-523230. **4) శ్రీమతి పాలకొల్లు శిరీష (హామీదారు), భర్త: ప్రభాకర్ రెడ్డి,** 7-7(1), మెయిన్ బజార్, తూర్పు పాలెం, పెద్దిరెడ్డిపల్లి పోస్ట్, నెల్లూరు జిల్లా-524236. వార్లకు డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయి **రూ.48,56,256/- (అక్షరాల నలభై ఎనిమిది లక్షల యాభై ఆరు వేల రెండు పందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)** చెల్లించమని కోరుతూ **తేది.09.05.2024 న** డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని **తేది.24.09.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తితో జరిపే ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం వడ్డీ & ఖర్చులతో సహా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

ఆం.ప్ర., ప్రకాశం జిల్లా, చంద్రశేఖరపురం మండలం, ముసునూరు రెవెన్యూ డివిజన్, రెడ్డివారిపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డోర్ నెం.2-48, సర్వే నెం.440, విస్తీర్ణం ఎ.2.53 సెంట్లు లేదా 12245.20 చ.గ.లలోని భూమి మరియు ఫ్లాక్షర్డి భవనం అందు యావదాస్తి **మెస్సర్స్ శ్రీ బాలాజీ మినరల్స్ (ప్రాపరిధ్యం వహిస్తున్న శ్రీమతి గోను సరళమ్మ, భర్త: చంద్రశేఖర్ రెడ్డి & శ్రీమతి పులి వినీల, తండ్రి: నాగేంద్ర రెడ్డి)** వారికి చెందినది. **హద్దులు: తూర్పు:** మామిళ్ళపల్లి యానాది రెడ్డి భూమి, **దక్షిణం:** చావా రామచంద్ర రావు గారి భూమి, **పడమర:** సొంత సడక దారి, **ఉత్తరం:** మామిళ్ళపల్లి యానాది రెడ్డి గారి భూమి.

(రిజిష్టర్డ్ దస్తావేజు నెం.1085/2018, తేది: 05.03.2018)

తేది : 24.09.2024 సం/- అధీకృత అధికారి

ప్రదేశం : పామూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పామూరు బ్రాంచ్

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ సమీ పంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో పి.సుప్రజ(32) అనే మహిళ ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు నగ రానికి చెందిన సుప్రజకు పదమూడేళ్ల క్రితం రవి అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ముగ్గురు మగపిల్లలు. అనంతరం భర్తను విడిచిపెట్టి ముస్సంగి నర

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలో ఎవరైనా ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం డీఎస్పీ నాగరాజు హెచ్చరించారు. ఆదివారం మార్కాపురం పట్టణంలో పలు ప్రాంతాలను డీఎస్పీ స్వయంగా పరిశీలించారు. . రహదారిపై ఇష్టాను సారంగా తోపుడు బండ్లు నిలుపుదల చేయడంతో పాటు ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు, లారీలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎక్కువగా ఎక్కడ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ పోలీసులతో చర్చించారుఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుబజారులో సూచనలు చేస్తున్న డీఎస్పీ నాగరాజు

వైద్య శిబిరానికి స్పందన

పొదిలి, న్యూస్‌టుడే: మండలంలోని మాదాలవారిపాలెంలో ఆదివారం ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పోలూరి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో రోగులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీగడ ఓబులరెడ్డి, నేతలు యల్లమంద, పీఆర్వో కోటి పాల్గొన్నారు.

సూరా అంకిరెడ్డికి నివాళి

గిద్దలూరు పట్టణం : సీపీఏం నాయకుడు సూరా అంకిరెడ్డి వర్ధంతి సందర్భంగా గిద్దలూరు సీపీఎం కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఏం పార్టీ నాయకులు టి.ఆవులయ్య, డి.థామస్, అల్లూరిస్వామి, డి.మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా శివార్లు

పొదిలి, న్యూస్‌టుడే:

వార్డులు : 20 జనాభా: 38 వేలు
శివారు కాలనీల్లోని జనాభా: సుమారు 15 వేలు, వార్డులు: 7

అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి

పొదిలి నగర పంచాయతీలోని శివారు కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరవై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి కుళాయిలు లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నగర పంచాయతీగా రూపాంతరం చెందిన తమ సమస్యలు పరిష్కరించేవారు కరవయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శివారు కాలనీలైన పిచ్చిరెడ్డితోట, శ్రీపతినగర్, విరాట్‌నగర్, బీసీకాలనీ, ఇస్లాంపేట, రాజుపాలెం, బుచ్చన్నపాలెం ప్రాంతాల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. పిచ్చిరెడ్డికాలనీలో గతంలో డీప్‌బోరు వద్ద నిర్మించిన చిన్న పాటి ట్యాంకుకు నీరు లీకై వృథాగా పోతుంది. కాలనీలో మూడు రోడ్లు ఉండగా.. ఒక్కరోడ్డుకు మాత్రమే సిమెంటు రోడ్డు వేశారు. మిగిలిన అంతర్గత రహదారులకు కాలువలు లేక వానొస్తే నీరు ఇళ్లలోకి వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీకాలనీలోనూ అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు కాలువలు లేక ఇళ్ల మధ్యే మురుగు పేరుకుపోతోంది. దీంతో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి శివారు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఇస్లాంపేటలో దెబ్బతిన్న మురుగునీటి కాలువ

వానొస్తే...భయం భయం

పెద్దనాగులవరం వద్ద ప్రమాదకరంగా నదిని దాటుతున్న గ్రామస్థులు (పాత చిత్రం)

❖ గ్రామాలకు రాకపోకలు బంద్
❖ వంతెనలకు నోచుకోని గుండ్లకమ్మ నది

మార్కాపురం, న్యూస్‌టుడే :

భారీ స్థాయిలో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గుండ్లకమ్మ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో భూపతిపల్లె, పెద్దనాగుల వరం, మాల్యవంతునిపాడు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అత్యవసర పరిస్థితులో ప్రాణాలు తెగించి నదిని దాటాల్సిన పరిస్థితి ఉంది. ఈ మూడు గ్రామాలకు సమీపంలో ఉన్న గుండ్లకమ్మనదిపై వంతెనలు నిర్మించాలని గ్రామస్థులు సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, జలవనరులశాఖ అధికారులు కూడా పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పడం తప్ప ఫలితం వచ్చింది లేదు. ప్రతి సారి వర్షం వచ్చిన సమయంలో గుండ్లకమ్మనది ప్రవహించడంతో వర్షం నీరు తగ్గే వరకు గ్రామాల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ పెద్దనాగులవరం గ్రామానికి సమీపంలో ఉన్న గుండ్లకమ్మపై చిన్నపాటి వంతెన కావడంతో దానిపై నుంచి వరదలు వచ్చినప్పుడు భారీ స్థాయిలో నీరు ప్రవహిస్తుంది. అయినా గ్రామస్థులు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అయిదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలోనే నది దాటుతూ 12 మంది ప్రమాద వశాత్తు పడిపోతే, వీరిలో ఎనిమిది చనిపోయారు. గుండ్లకమ్మ నదికి దిగువన ఉన్న చెక్‌డ్యాంకు రంధ్రం ఏర్పాటు చేసి నీటిని దిగువకు విడుదల చేశారే కానీ పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణ చేపట్టాలన్న విషయాన్ని పాలకులు పూర్తిగా మరిచిపోయారు. భారీ వరద నీరు వచ్చినప్పుడు కల్వర్టు పై నుంచి నీరు పారుతుంది. గతంలో అన్ని రాజకీయ పార్టీలు ఆందోళన చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని, గత ప్రభుత్వం తమను పూర్తిగా విస్మరించిందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనలు నిర్మాణం చేసింది లేదని, ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరైంది లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ భూపతిపల్లె గ్రామానికి సమీపంలో ఉన్న గుండ్లకమ్మనది వల్ల భారీ వరదలు వచ్చినప్పుడు మార్కాపురం- తర్లుపాడు రహదారి మీదుగా కంభం వైపు వెళ్లే వాహనాలు పూర్తిగా నిలిచిపోతాయి. వరద నీరు పూర్తిగా తగ్గడానికి రెండు నుంచి మూడు రోజులు పడుతుంది. ఆ రోజుల వరకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోవాల్సిందే. గత ఏడాది భారీ వర్షాల వల్ల కల్వర్టు వంతెన కూలిపోయింది. దీంతో రెండు రోజులు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు తాత్కాలికంగా మట్టి పోసి రాకపోకలకు అవకాశం కల్పించారు. వర్షం పడితే కల్వర్టు కింద పోసిన మట్టి సిమెంట్ దిమ్మెలు కొట్టుకు పోయి పూర్తి స్థాయిలో కుంగిపోయే ప్రమాదం ఉంది.

❖ మాల్యవంతునిపాడు గ్రామానికి సమీపంలోనూ ఇదే పరిస్థితి. గుండ్లకమ్మ నది నీరిస్తే ఈ గ్రామానికి కూడా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రం వంతెనలు నిర్మాణం చేస్తామని హామీ ఇవ్వడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండటం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భూపతిపల్లె సమీపంలో గుండ్లకమ్మనదిపై ఉన్న చిన్నపాటి కల్వర్టు

ప్రతిపాదనలు పంపించాం

పెద్దనాగులవరం గ్రామానికి సమీపంలో ఉన్న గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మాణానికి రూ.16 కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. భూపతిపల్లె గ్రామం వద్ద భారీ స్థాయిలో వంతెనలను నిర్మాణం చేయడానికి ప్రభుత్వానికి గతంలో రూ.7 కోట్ల కావాలని ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– విజయమోహన్‌రాజా, పంచాయతీరాజ్ ఏఈ, నరసింహులు, ఆర్‌అండ్‌బీ డీఈ. కంభం

నమూనా పరీక్షలతో అవగాహన

మార్కాపురం, మార్కాపురం పట్టణం, గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు నమూనా పరీక్షలు రాయడం వల్ల ఎంతో అవగాహన ఏర్పడుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య పేర్కొన్నారు. మార్కాపురంలో ఎస్టీయూ డివిజన్ కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన టెట్ నమూనా పరీక్ష పత్రాన్ని విడుదల చేశారు. పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టెట్ పరీక్ష పేపర్‌ను ఎంఈవో బి.రాందాస్‌నాయక్‌ఆవిష్కరించారు. మొత్తం 76 మంది ఈ పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్, డీఏఎఫ్ఐ, టీచర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం టెట్ మోడల్ పరీక్ష నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సత్యనారాయణ టెట్ మోడల్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రమణారెడ్డి, జి.శాయన్న, పి.రంగారెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ మోడల్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం, మార్కాపురం పట్టణం : మండలంలోని పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్థులు, భక్తులు కుంకుమ బండ్లతో పాటు పొంగళ్లు వండుకోని బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ❖ మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో వెలిసిన అల్లూరి పోలేరమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

బేస్తవారపేట, కంభం: మండలంలోని చిన్న ఓబినేనిపల్లి గ్రామ దేవతలైన శ్రీ పోలేరమ్మ, గంగమ్మ తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి బోయిళ్ల శ్రీనిశ్వరరెడ్డి, వ్యాపారవేత్త నాగేశ్వరరెడ్డి అమ్మవార్లకు రూ.2 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాలను బహూకరించారు. ❖ కంభం పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం దేవాలయ నిర్మాణ దాత గునుపూడి భాస్కర్ ఆవిష్కరించారు. దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఒరిగిపోయింది..

ఈ చిత్రంలో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఈ స్తంభం గిద్దలూరు-కొమరోలు రహదారిలోని ఓ రైతు పొలంలో ఉంది. ఈ ప్రాంతం నల్లరేగడి నేల కావడంతో స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. భారీ గాలులు వీస్తే కింద పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదం చోటు చేసుకోకముందే ఈ స్తంభాన్ని సరిచేయాలని రైతులు విద్యుత్తుశాఖ అధికారులను కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008574141
పొదిలి : 8008550360

మేమున్నాం.. మీకు తోడుగా..

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

సమస్య : కొర్రప్రోలు సమీపంలోని కర్నూలు-గుంటూరు రహదారిలో వంతెన రక్షణ గోడ పడిపోయింది. గోడ నిర్మించండి.

–వెంకటేశం, కొర్రప్రోలు.

సమాధానం: ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే వెంటనే పనులు చేపడతాం.

– నాగస్వామి, జేఈ, జాతీయ రహదారి

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే

? : వినుకొండ డిపో నుంచి యర్రగొండపాలేనికి సాయంత్రం 6 గంటలకు నడిచే ఆర్టీసీ సర్వీసును రద్దు చేశారు. సాయంత్రం ఆరు దాటితే వినుకొండ నుంచి త్రిపురాంతకం వైపు వచ్చేందుకు ఆర్డినరీ సర్వీసులు లేవు. ఎక్స్‌ప్రెస్‌లు ఆగవు. గ్రామీణ ప్రాంతాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

–నల్లబోతుల సుధాకర్, డీవీఎన్ కాలనీ, త్రిపురాంతకం

✓ : కొన్ని బస్సులు కాలపరిమితి ముగియడంతో సర్వీసులు రద్దు చేశాం. త్వరలో ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరిస్తాం.

– నాగేశ్వరావు, డిపో మేనేజర్, వినుకొండ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

? : మున్సిపాలిటీని అనుకున్న రైస్ షాపుల వద్ద కాలువలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించండి.

– అశోక్, పట్టణవాసి

✓ : వెంటనే సిబ్బందిని పంపించి అక్కడ శుభ్రం చేయిస్తాం. –చెన్నకేశవులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: నందిగుడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందబోతున్న తాడువాయి వెంకట నాగమణి దేవిని ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక అమ్మవారిశాల ఆవరణలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎమ్.నాగేశ్వరరావు అధ్యక్షతన ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఆమెను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



వెంకట నాగమణిదేవి దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

వినూత్న ఆలోచనలతో స్థిరాస్తి రంగంలో అభివృద్ధి

మార్కాపురం, న్యూస్‌టుడే : మార్కాపురంలో స్థిరాస్థి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇప్పుడే మార్కాపురం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విజయవాడకు చెందిన శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిడెట్ కంపెనీ మార్కాపురంలో శ్రీ సిటీ పేరుతో స్థిరాస్థి వ్యాపార రంగానికి సంబంధించిన వెంచర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక పెద్ద గృహ నిర్మాణ సంస్థ వెనుకబడిన ప్రాంతమైన మార్కాపురంలో పెట్టుబడులు పెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీ భ్రమర హౌసింగ్ ఛైర్మన్, ఎండీ గళ్లా రామచంద్రరావులు మాట్లాడుతూ మూస పద్ధతిలో కొనసాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమూలమైన మార్పులు చేపట్టి, వినూత్నమైన ఆలోచనలతో, అద్భుతమైన వెంచర్లలో గృహ నిర్మాణ రంగాన్ని చేపట్టి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అన్ని అనుమతులు ఉన్న శ్రీ సిటీని ఏర్పాటు చేయమని అనేక మంది కోరిన నేపథ్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, ఎం.పి.కె.లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, చెన్నంశెట్టి సతీష్‌బాబు, కల్వకోట సాయిశంకర్, సంస్థ సీనియర్ జనరల్ మేనేజరు చిట్టెం రమణారెడ్డి పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్, ఎండీ ఎండీ గళ్లా రామచంద్రరావు, కంపెనీ ప్రతినిధులు

స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొమరోలు-గిద్దలూరు మార్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలను కొమరోలు మండలం బాదినేనిపల్లెకు చెందిన దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ పూడ్చించే పనులను చేపట్టింది. ఏళ్లుగా రహదారి పై ఏర్పడిన గుంతలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో వాహన ప్రమాదాలు ఎక్కువయ్యాయి. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ఈ విషయాన్ని గుర్తించారు. తమ వంతుగా నిధులు సేకరించి రూ.10,000 విలువైన పనులను ఈ రహదారి మార్గంలో చేపట్టారు. గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

ద్వారకచెర్ల వద్ద ఏర్పడిన గుంతను పూడుస్తున్న సంస్థ సభ్యులు

అనుమతులు లేని బాణసంచా స్వాధీనం

మార్కాపురం : అనుమతులు లేకుండా పటాకులు కలిగి ఉన్న ఓ వ్యక్తిని మార్కాపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ చెందిన షేక్ జాకీర్ హుసేన్ అనే వ్యక్తి తారా జువ్వలను అనుమతి లేకుండా తయారు చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని నివాసంపై దాడి చేసినట్లు పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు. జాకీర్ హుసేన్‌ను అరెస్టు చేసి అతని వద్ద రూ.5,000 విలువైన తారాజువ్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్యం సీసాల పట్టివేత..

అర్థవీడు, కంభం : గన్నేపల్లి గ్రామానికి చెందిన ఓ ఇంట్లో నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణంపై ఆదివారం ఎస్సై సుదర్శన్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. వంద మద్యం సీసాలను, విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. **కంభం** మండలంలోని చిన్నకంభం గ్రామంలో మద్యం అమ్ముతున్న ఒకరిని అదుపులోకి తీసుకొని 40 క్వార్టర్, మరో 3 పెద్ద సీసాలు ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ధ్యాన సాధనతో ఆనందమయ జీవితం

పొదిలి, న్యూస్‌టుడే: మన దైనందిన జీవితంతో ధ్యానం ఒక భాగం కావాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి.శైలజ చెప్పారు. పొదిలిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరులో ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, పాతూరులోని సాయిబాబా దేవాలయం ఆవరణలో ఉచిత ధ్యానయోగ శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా గిద్దలూరు టెన్నిస్ కోర్టులో అక్టోబరు 1న అండర్-14, 17 బాల, బాలికలకు టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు గిద్దలూరు కో-ఆర్డినేటర్లు స్వర్ణ శ్రీనివాసరెడ్డి, గుర్రం శోభన్ బాబు తెలిపారు.

బాలాజీకి అభినందనల వెల్లువ

యర్రగొండపాలెం పట్టణం, పెద్దదోర్నాల, పొదిలి , న్యూస్‌టుడే : ఒంగోలు పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు నూకసాని బాలాజీ రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించడంతో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబుతో పాటు అయిదు మండలాల తెదేపా నాయకులు ఆదివారం ఒంగోలు ఆ పార్టీ కార్యాలయంలోఆయనను కలిసి అభినందనలు తెలిపారు. శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఏపీ మారిటం బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్ దామచర్ల సత్యను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.! బాలాజీని పొదిలి మండల తెదేపా నాయకులు కలిసి అభినందించారు.

బాలాజీని అభినందిస్తున్న ఎరిక్షన్‌బాబు, నాయకులు

తీవ్రంగా గాయపడ్డ మహిళను ఒంగోలు తరలిస్తున్న దృశ్యం

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. కూలీలకు గాయాలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి-ఒంగోలు మార్గంలోని అగ్రహారం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు కూలీలు గాయపడ్డారు. కాటూరివారిపాలెంకు చెందిన వ్యవసాయ కూలీలు చీమకుర్తి మండలం కంభంపాడుకు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తున్న క్రమంలో అగ్రహారం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా స్టైడుకు తిప్పడంతో ట్రాలీకి ఉన్న లింకు ఊడి ట్రక్కు ఏటవాలుగా పడింది. అందులో ఉన్న కూలీలు కింద పడి గాయపడ్డారు. క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ రజిత, పద్మలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించామని, మిగిలిన వాళ్లకు చిన్న చిన్న దెబ్బలు తగిలాయని డాక్టర్ ఆనందబాబు తెలిపారు.ట్రాలీలో సుమారు 15 మంది వరకు కూలీలు ఉన్నట్లు సమాచారం. ట్రాలీ పూర్తిగా బోల్తా పడితే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. గాయపడ్డ వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు.

శంకుస్థాపన చేసి.. ఆపై వదిలేసి

❖ మూడు నియోజక వర్గ ప్రజలకు కలగా మారిన రోడ్డు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే:

తారు రోడ్డు నిర్మాణ దశలో ప్రభుత్వం మారడంతో సీసీ రహదారి నిర్మాణం ఆగిపోయింది. దాన్ని తమ హయాంలో పూర్తి చేస్తామని గొప్పలు చెప్పి శిలాఫలకం వేసిన వైకాపా నాయకులు అయిదేళ్ల కాలంలో పట్టించుకోలేదు. దీంతో ఆ రహదారి పరిధిలోని గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వివరాల్లోకి వెళ్తే... త్రిపురాంతకం మండలం హైవే లోని బీఆర్ జంక్షన్ నుంచి గొల్లవాండ్లపల్లి మీదుగా పెద్దారవీడు మండలం మల్లవరం వరకు రెండు కిలోమీటర్ల రహదారిని 2018లో తెదేపా హయాంలో తారు రోడ్డుగా ఆధునికీకరించారు. బీఆర్ జంక్షన్ నుంచి గొల్లవాండ్లపల్లి వరకు తారు రోడ్డుకు అనుసంధానంగా సిమెంటు రోడ్డు వేయాల్సి ఉంది. అయితే 2019లో ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా దాన్ని వేయలేక పోయారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆగిపోయిన తారు రోడ్డుకు అనుసంధానించాల్సిన సిమెంటు రోడ్డును తమ హయాంలో నిర్మిస్తామంటూ రూ.89.22లక్షలతో వైకాపా నాయకులు పనులకు శ్రీకారం చుట్టి శంకుస్థాపన చేశారు. అయిదేళ్లు పూర్తయినా పనులను చేపట్టలేదు. ఆ శిలాఫలకం మాత్రం పిచ్చికంపలో వెక్కిరిస్తోంది. మల్లవరం మీదుగా అటు మార్కాపురం ఇటు కురిచేడు మీదుగా దర్శి ప్రాంతాల వైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు రాకపోకలు సాగిస్తుంటారు. మల్లవరం నుంచి గొల్లవాండ్లపల్లి వరకు తారు రోడ్డు వేసినా అక్కడ నుంచి బీఆర్ జంక్షన్ వరకు సీసీ రహదారి నిర్మించక పోవడంతో మట్టిదారి అంతా గుంతలు ఏర్పడి పిచ్చి కంప అల్లుకుపోవడంతో రెండు పర్లంగుల మేర అధ్వానంగా మారింది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈక్రమంలో మట్టి రోడ్డును సీసీ రహదారిగా మార్చి తారు రోడ్డుకు అనుసంధానించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

గుంతలతో బురదమయంగా మారిన మట్టిరోడ్డును చూపిస్తున్న గ్రామస్థుడు



ముళ్ల కంపతో మూసుకుపోయిన శిలాఫలకం

ద్విచక్ర వాహనం ఢీ కొని...

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు పాండురంగా రెడ్డినగర్‌లోని డీఆర్ఆర్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే విశ్రాంత ఉద్యోగి నిబ్బరగండ్ల రాజశేఖర్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వెళుతుండగా అటవీశాఖ కార్యాలయం సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డికి గాయాలు కాగా స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు చేయించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా..
కనిగిరి : 8008574114,
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

పీసీపల్లి, న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని పెదఇర్లపాడు సమీపంలో విద్యుత్తు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ స్తంభం నుంచి 11 కేవీ విద్యుత్తు సరఫరా జరుగుతుంది. సరిచేయగలరు. **–స్థానికులు**

సమాధానం : రెండు రోజుల్లో స్తంభాన్ని సరి చేస్తాం. **–వెంకటరత్నం, జేఎల్‌ఎం, పెదఇర్లపాడు**

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే

సమస్య: తిమ్మారెడ్డిపల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని మోరావారిపల్లి లైన్‌లో తీగలు తరచూ తెగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. **– కొండరాజు, కోటతిప్పల**

సమాధానం: మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం. **–మణికంఠ, విద్యుత్తు ఏఈ**

ఆక్రమణల తొలగింపు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామాలయం వీధి నుంచి శివాలయం వీధి వరకు రోడ్డును కొందరు ఆక్రమించిన విషయమై మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్బుల్ గఫార్‌కు రెండు రోజుల క్రితం స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన ఆదివారం ఆక్రమణలు, వ్యర్థాలు, చెత్తను దగ్గరుండి తొలగింపజేయించారు. ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల నుంచి రెండు దేవాలయాలకు వెళ్లే రోడ్డును కొందరు స్వార్థంతో ఆక్రమించి ఉపయోగించుకుంటున్నారన్నారు. అందుకే ప్రజల ఫిర్యాదు మేరకు పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. పట్టణంలోని కొన్ని రోడ్లు ఇలాగే ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని, అక్కడ కూడా ఆక్రమణలు తొలగించి రాకపోకలు సాగించేందుకు వీలు కల్పిస్తామన్నారు.

పోలేరమ్మ ఆలయ ఈవోగా బాధ్యతల స్వీకరణ

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లిలో వెలసిన పోలేరమ్మ ఆలయ ఈవోగా వై.భైరాగిచౌదరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పూర్వ ఈవో శివశంకర్ ఒంగోలు ప్రసన్న చెన్నకేశవ ఆలయానికి బదిలీపై వెళ్లారు.

ఇళ్ల పక్కనే పొంచి ఉన్న ప్రమాదం

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

గ్రామాల్లో ఏ వీధిలో చూసినా విద్యుత్తు తీగలు, పరివర్తకాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్తు అధికారులు గత వైకాపా పాలనలో నాయకులతో అంటకాగి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. అయిదేళ్లలో మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు విద్యుత్తు సమస్యలపై గగ్గోలు పెట్టినా ఫలితం లేకపోయింది.

వేపచెట్ల కొమ్మల్లో నుంచి వెళ్తున్న పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీ విద్యుత్తు లైన్

వినతులు బుట్టదాఖలు..

సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ ఎస్సీ కాలనీలో రెండేళ్లుగా విద్యుత్తు తీగలు భారీ వృక్షాల మధ్యలో, నివాసాలకు ఆనుకుని ఉన్నా సిబ్బంది కన్నెత్తి కూడా చూడటం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గాలులకు చెట్ల కొమ్మలు పడి విద్యుత్తు తీగలు తెగితే ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేసినా బుట్ట దాఖలయ్యాయని స్థానికుడు మించల బ్రహ్మయ్య చెప్పారు. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలు, గాలులకు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి రాసుకుని మంటలు చెలరేగాయని, ఆ సమయంలో నివాసాల్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెను ప్రమాదం సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్తు తీగలు

అక్రమ వెంచర్లకు ఆఘమేఘాలపై..

మూలగుంటపాడు పరిధిలోని ప్రైవేటు కళాశాల సమీపంలోని, సోమరాజుపల్లి, కనుమళ్ల గ్రామాల పరిధిలోని అక్రమ వెంచర్లకు అధికారులు ముడుపులు తీసుకుని ఆఘమేఘాలపై స్తంభాలు, విద్యుత్తు తీగలు అమర్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ లేఅవుట్లకు నిమిషాల వ్యవధిలోనే విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తారని, సామాన్య ప్రజల ఇబ్బందులపై మాత్రం పట్టించుకోరని మండలవాసులు విమర్శిస్తున్నారు. దీనిపై ఏఈఈ సాంబశివరావును వివరణ కోరగా.. పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీలో వెంటనే చెట్ల కొమ్మలను తొలగిస్తామని, నివాసాలకు దూరంగా తీగలను అమర్చుతామని తెలిపారు.

కేసుల ఛేదనలో సాంకేతికత అవసరం

జరుగుమల్లి, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య సిబ్బందికి సూచించారు. జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పడాలని సూచించారు. ఎస్సై పున్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు: హనుమంతునిపాడు: గ్రామాల్లో ప్రశాంతతకు సహకరించాలని, అనవసర గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.మాధవరావు హెచ్చరించారు. ఆదివారం సీతారాంపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలపై కేసులు నమోదు చేశారు.

గుంతల మార్గం.. అవస్థల ప్రయాణం

న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

నియోజకవర్గ కేంద్రమైన కొండపి మండలంలో రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైకాపా అయిదేళ్ల పాలనలో వీటిని పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గమ్యస్థానాలకు చేరే వరకు బిక్కుబిక్కు మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా చొరవ తీసుకొని రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెట్లూరు– పొదిలి రహదారిలో ఏర్పడిన గుంతలు

వర్షాలు పడితే మరిన్ని ఇబ్బందులు..

మండలంలోని పెట్లూరు-పొదిలి మార్గంలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్న పాటి వర్షాలకే వీటిలో నీరు చేరి ప్రయాణికులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. ఈ దారిలో అడుగుకో గుంత ఏర్పడటంతో రోడ్డంతా ప్రమాదకరంగా మారింది. అయినా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల ర.భ శాఖ ఏఈ దీప్తిని వివరణ కోరగా.. నిధుల విడుదలలో జాప్యంతో పనులు ఆగిపోయాయని, తొందర్లోనే సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

గుండె వ్యాధులపై అలసత్వం తగదు

పామూరు: ఆరోగ్యం పట్ల ప్రజలు, రోగులు అప్రమత్తంగా ఉండాలని గుండె వ్యాధుల వైద్య నిపుణుడు ఎం.సునీల్‌కుమార్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా పామూరులోని మల్లికార్జున రెడ్డి స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా గుండె వైద్య శిబిరం జరిగింది. వైద్యులు ఎం.సునీల్‌కుమార్, పి.మల్లికార్జునరెడ్డిలు దీనిని ప్రారంభించారు. గుండె వ్యాధులకు సంబంధించి అలసత్వం వహించరాదని చెప్పారు. నిత్యం నడక, వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలన్నారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 200 మంది రోగులకు ఈసీజీ, 2డి ఎకో తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. **కురిచేడు:** కురిచేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ ఏషియన్ ఆసుపత్రి వైద్యులు ఆదివారం స్థానిక శ్రీ రాఘవేంద్ర విద్యాలయంలో రక్తనాళాల పరీక్షల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రమణారావు మాట్లాడుతూ..నుంచి 200 మంది రోగులు వచ్చారని, వారిలో రక్త నాళాల్లో గడ్డలు కలిగి ఉన్న 54 మందికి శస్త్ర చికిత్స అవసరమైనట్లు వైద్యులు చెప్పారన్నారు. వారందరికీ ఉచితంగా శస్త్రచికిత్సలు అందించనున్నట్లు వైద్యులు తెలిపారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణ, ప్రసాదరావు, కృష్ణారావు, లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, వైద్యురాలు ప్రమోద పాల్గొన్నారు.

ఫోటో, వీడియో గ్రాఫర్ల కార్యవర్గం ప్రమాణ స్వీకారం

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు ఫొటో, వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా షేక్ అమీర్ బాషా, అధ్యక్షుడిగా చుండి రమేష్‌బాబు, ఉపాధ్యాక్షుడిగా శ్రీహరిబాబు, కార్యదర్శిగా కిరణ్, సభ్యులుగా కోటేశ్వరరావు, నాగరాజు, సుబ్బారావు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్, మదన్ చంద్రశేఖర్, పులిచర్ల శ్రీనివాసరావు, ప్రసాద్, కృష్ణ, శేషయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

సంక్షోభంలోకి వ్యవసాయ రంగం

కనిగిరి, న్యూస్‌టుడే: పాలకులు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకుంటాం.. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి కాపాడుతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. దీనిని మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తొలుత సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవరావు, శ్రీనివాసరెడ్డి, బషీరా, నరేంద్ర, తిప్పారెడ్డి, ప్రసన్న, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు సన్మానం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి ఆర్డీవోగా పనిచేస్తూ కడప ఆర్డీవోగా బదిలీపై వెళ్లిన పాలపర్తి జాన్ ఇర్విన్‌ను ఆదివారం కనిగిరి దుర్గం బాప్టిస్టు చర్చిలో కమిటీ సభ్యులు సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఆయన ఎంతో హుందాగా, నిజాయతీగా పని చేశారన్నారు. కడప ఆర్డీవోగా కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ ప్రభు మనోహర్ దాసు, చర్చి కమిటీ సభ్యులు సర్వోన్నత కుమార్, విద్యాసాగర్, అశోక్, సదానందం, బాబూరావు, రూప్‌కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తూర్పుగంగవరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు ఆలయంలో పూజలు చేశారు. ఆలయంవద్ద కొందరు కొత్త వాహనాలకు పూజలు చేయించారు. ఈవో పి.కార్తీక్, దేవాలయ ట్రస్టీ అధ్యక్షులు కొసనా గురుబ్రహ్మం, పూజారులు కామేశ్వరశర్మ, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఈవో తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణస్వామి ఆలయంలో ..

సి.ఎస్.పురం: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్టును పూలమాలలతో అలంకరించారు. అర్చకులు గోపూజ చేశారు. నారాయణస్వామి పల్లకీసేవ, రథోత్సవం జరిగాయి. భక్తులు ఉత్సాహంగా పల్లకీ మోసి రథాన్ని లాగారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

దర్శిలో మానవత శాఖ ప్రారంభం

దర్శి: దర్శిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన శాఖ ఆదివారం ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. సంస్థ ఆశయాలను వివరించటంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రమాణస్వీకారం చేయించారు. స్థానిక పీజీఎన్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్స్ కమిటీ ఛైర్మన్‌గా దేవత వరప్రసాద్, వైస్ ఛైర్మన్‌గా వాకా జనార్దనరెడ్డి, కన్వీనర్‌గా కపురం శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులుగా వెంకటరెడ్డి, కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహా, శాంతి కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. సంస్థ ఏర్పడిన సందర్భంగా శాంతిరథానికి దేవతి వరప్రసాదరావు, భాస్కరరావు, మహానంద, రామారావులు వితరణ చేశారు. ఫ్రీజరుబాక్సులను కడప షిర్డీ సాయి ఎలక్ట్రికల్ సాయంతో, ఉపాధ్యాయులు బాదం వెంకటేశ్వరరెడ్డి, కనమర్ల గుండారెడ్డి, పసుపులేటి వెంకట నారాయణ, రాజకేశవరెడ్డి తదితరులు ఒక్కొక్కటి చొప్పున అందించారు. పవన్ క్లాత్ షోరూమ్ శేషారావు రూ.25 వేల నగదును వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రకటన

మా క్షయింటు అయిన ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, కలికివాయ గ్రామ కాపురస్తుడు అయిన **గొరవరపు పెదకోటిరెడ్డి కుమారుడు గొరవరపు శంకరరెడ్డి గారు** నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్షయింటు జరుగుమల్లి మండలం, నందనవనం గ్రామ కాపురస్తులైన ముప్పు మాధవరావు @ మాధవ భార్య అయిన ముప్పు సులోచనపై కందుకూరు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో OS No. 640/2024 నెంబరున రూ. 15,02,400/- (అక్షరముల పదిహేను లక్షల రెండు వేల నాలుగు వందలు రూపాయలు) దావా పరిహారం కొరకు ప్రాంసరీ నోటు దావా దాఖలు చేసిఉన్నారు. సదరు దావాలో IA No. 785/2024 నెంబరున ముప్పు సులోచనకు చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన అటాచ్‌మెంట్ పిటిషన్ కూడా దాఖలు చేసిఉన్నారు. సదరు కేసు కోర్టులో 15.10.2024వ తేదీకి వాయిదా వేయబడి ఉన్నది. సదరు దావా షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ప్రతివాది అయిన ముప్పు సులోచన ఎటువంటి క్రయ, విక్రయాలు జరిపిన యెడల, సదరు క్రయ విక్రయాలు మా క్షయింటును బద్ధపరచవని, చట్టరీత్యా చెల్లవని యావన్మందికి తెలియజేయడమైనది. ఒక వేళ కోర్టును కూడా దిక్కరించి, విక్రయాలు జరిపినయెడల, వారిని సదరు దావాలో రెస్పాండెంట్లుగా చేర్చి ప్రాసిక్యూట్ చేయడమని ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించి సదరు ముప్పు సులోచన W/o మాధవరావు @ మాధవ పేరున ఉన్న ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ మా క్షయింటు వద్ద ఉన్నది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్ - సింగరాయకొండ సబ్ రిజిస్ట్రేషన్ - జరుగుమల్లి రెవిన్యూ మండలం - నందనవనం గ్రామ పంచాయతీ - ఖాతా నెం. 908 సర్వే నెం.352/10 ఆన్‌లైన్ విస్తీర్ణం 0.71 సెంట్లు వ్యవసాయ మెట్టభూమి హద్దులు. **తూర్పు:** కుంట పోరంబోకు, **దక్షిణం:** గోనుగుంట కామయ్య భూమి, **పడమర:** మా క్షయింటు భూమి, **ఉత్తరం:** రోడ్డు.

సం/- **బక్కముంతల వెంకటేశ్వర్లు** B.Sc., BL.LSc, BL, LLM
సింగరాయకొండ, తేది.30.09.2024
అడ్వకేట్ & నోటరీ, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా.

(c) eenadu

ఊరికి ఉపకారి.. బడికి హితకారి

దాతృత్వమూర్తి తిరుపతిరావు రూ.కోటితో వసతుల కల్పన

ఓనమాలు దిద్దిన బడి.. జన్మనిచ్చిన ఊరును ఆయన విస్మరించ లేదు. వాటి ఉన్నతికి నిత్యం శ్రమించారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నా తన వారి కోసం పరితపించారు. కోటి రూపా యలు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ఇలా విద్యార్థుల, గ్రామస్థుల కష్టాలు దూరం చేశారు కనిగిరి మండలం మిట్టమీదప ల్లికి చెందిన పూర్వ విద్యార్థి నాదెళ్ల తిరుపతిరావు.

న్యూస్‌టుడే, కనిగిరి :

హైదరాబాద్‌తో స్థిరపడిన ప్రముఖ పారిశ్రామికవేత్త నాదెళ్ల తిరుపతిరావు సొంతూరు మిట్టమీదపల్లి. నలభై ఏళ్ల క్రితం గురవాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్‌లో వ్యాపారవేత్తగా స్థిర పడ్డారు. ఓ సారి పాఠశాలను సందర్శించగా, అక్కడ వస తుల లేమి ఆయన్ను వేదనకు గురిచేసింది. తన తోటి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించి గత పదేళ్లుగా పాఠశాలలో వసతుల కల్పనకు రూ. 50 లక్షలు వెచ్చించారు.

పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

మురిసిన చదువుల తల్లి..

గురవాజీపేట పాఠశాలకు రూ. 3 లక్షలతో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయించారు. మరో రూ. 3 లక్షలతో ఇనుప బెంచీలు అందజేశారు. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు. విద్యార్థులకు నెలకు రెండుసార్లు నాణ్యమైన మాంసాహార భోజనం సమ కూరుస్తున్నారు. డిజిటల్ తెరను ఏర్పాటు చేయించారు. రూ.4 లక్షలతో శుద్ధి జల ప్లాంట్ నెలకొల్పారు. విద్యార్థు లకు ఉచిత బస్‌పాస్‌లు సైతం సమకూరుస్తున్నారు.

పాఠశాలలో నెలకొల్పిన డిజిటల్ తెర వద్ద విద్యార్థుల చదువులు

గ్రామ వికాసానికి..

అయిదేళ్లుగా గురవాజీపేట పంచాయతీలోని చాగంరెడ్డిపల్లి, మిట్ట మీదపల్లి, గురవాజీపేట ఎస్సీ కాలనీలో ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు రూ.20 లక్షలు ఖర్చుచేశారు. గురవాజీపేట పీహెచ్‌సీకి కోసం రూ. 3 లక్షలతో ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ సామగ్రి అందజేశారు. పశు వైద్యశాలకు రూ. 1.20 లక్షలతో వసతులు సమకూర్చారు. గ్రామంలో మొక్కల పెంపకం ఇతరత్రా వసతులు కోసం నిధులు వెచ్చించారు. రూ. 15 లక్షలతో ముస్లింల కోసం పీర్లచావిడి నిర్మించారు. ఇటు పాఠశాలకు, అటు గ్రామానికి నిధులు వెచ్చించి సౌక ర్యాలు కల్పించడం ఎంతో సంతృప్తినిచ్చిందని, ఇదే ఒరవడిని కొన సాగిస్తానని నాదెళ్ల తిరుపతిరావు చెబుతున్నారు.

దివ్యాంగుని పెద్ద మనస్సు

విరాళాలు సేకరించిన తెదేపా నాయకుడు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: దివ్యాం గుడైన తెదేపా నాయకుడు వరద బాధితులకు అండగా నిలిచారు. సీతారాంపురానికి చెందిన గ్రామ తెదేపా అధ్యక్షుడు సానికొమ్ము వెంకటే శ్వరరెడ్డి కష్టనష్టాల కోర్చి బంధువులు, స్నేహి తుల నుంచి రూ.1 లక్ష మేర విరాళాలు సేక రించారు. ఈ మేరకు నగదుతో పాటు దాతల వివరాలను ఆదివారం మండల తెదేపా అధ్య క్షుడు ఎస్.తిరుపతిరెడ్డికి అందజేశారు. తన సొంత నిధులకు దాతలందించిన నగదు జోడిం చానన్నారు. ఆయన కృషిని గ్రామస్థులు కొని యాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కందుల వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి తోపాటు గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నగదు, వివరాల పత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఎక్సైజ్ శాఖలో అధికారుల నియామకాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్సైజ్‌శాఖలో పలువురు అధికారులను నియమిస్తూ ఆ శాఖ డైరక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇన్‌స్పెక్టర్లతో పాటు జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను నియమించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఇటీవల ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంతో వారిని కూడా కలుపుకుని జిల్లాలోని స్టేషన్లకు అధికారుల నియమించారు. కొత్త వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.లీనా (ఒంగోలు), ఎం.సుకన్య (చీమకుర్తి), ఎం.శివకుమారి (సింగరాయకొండ), టి.అరుణకుమారి (పొదిలి), కె.శ్రీనివాసరావు (దర్శి), ఎం.వెంకటరెడ్డి (మార్కాపురం), ఆర్.విజయభాస్కరరావు (కనిగిరి), ఎం.జయ రావు (గిద్దలూరు), ఎస్.కొండారెడ్డి (కంభం), సి.హెచ్.శ్రీనివాసులు (యర్రగొండపాలెం) నియమితుల య్యారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా బి.ఈశ్వరరావును నియమించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమి షనర్లుగా ఎస్.రామారావు, ఆర్.నరహరిరావులను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ డైరక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని ఐ.ఎం.ఎల్ డిపో ఇన్‌ఛార్జిగా పి.వి.శేషయ్యను నియమించారు.

మద్దిపాడుకు వెంకన్న పాదయాత్ర

మద్దిపాడు, న్యూస్‌టుడే: భద్రా చలం రామన్న ఆలయం నుంచి తిరు పతి వెంకన్న సన్ని ధికి చేపట్టిన పాద యాత్ర శనివారం మద్దిపాడుకు చేరింది. 'అందరూ బాగుం డాలి..అందులో మన ముండాలి' అన్న భావనతో త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ఈ నెల 19న భద్రాద్రిలో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ భద్రాచలం నుంచి వెంకన్న సన్నిధికి పాదయాత్ర వరుసగా ఏడు లీపు సంవత్సరాల్లో చేయ సంకల్పించామన్నారు. ఇప్పటికే ఆరు పర్యాయాలు యాత్ర చేశామని. చివరిదైన ఏడో పాద యాత్రను ప్రస్తుతం కొనసాగిస్తున్నామన్నారు. లోక కల్యాణార్థం చేపట్టామని ఆయన చెప్పారు.

భద్రాద్రి రామన్న- తిరుమల వెంకన్న పాదయాత్రలో పాల్గొన్న త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బంది

పాఠశాల విద్య అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పద్మకుమారి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యా సర్వీసెస్ అసోసియే షన్ రాష్ట్ర నూతన కమి టీని ఆదివారం విజయవా డలో జరిగిన సమావే శంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న బి.పద్మకుమారి, గౌరవాధ్యక్షునిగా అడగా స్వాములు, ఉపాధ్యక్షునిగా ఎన్.బాలాజీలు ఎన్నికయ్యారు. ఈ ముగ్గురు జిల్లాకు చెందిన వారు. విద్యాశాఖలో ఉద్యోగోన్నతులు కల్పించాల్సిన విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతా మని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర నూతన కమిటి సమావేశంలో తీర్మానం చేశామన్నారు.

నూతనంగా ఎన్నికైన సభ్యుల అభివాదం

ఒంటరి తనం భరించలేక ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఒంటరితనం భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నారు. అనకాపల్లి పట్టణ ఎస్సై సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. పామూరు మండలం పుట్టమినాయునిపల్లికి చెందిన రాయవరపు శ్రీనివాసరావు (34)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఆరునెలల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. అప్పటి నుంచి అతను అనకాపల్లి మండలం బీఆర్‌టీ కాలనీలోని తన అక్క రామలక్ష్మి ఇంటి వద్ద ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శని వారం పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

ఇసుక తోల వద్దన్నందుకు మహిళపై దాడి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తోలుతుంటే అడిగినందుకు తనపై కొందరు దాడి చేశా రని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రిష్ణబాజీబాబు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడు మండలం మద్దులూరుకు చెందిన దేవినేని లక్ష్మీకు మారికి కొండపి మండలం నెన్నూరుపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 8లో అయిదెకరాల పొలం ఉంది. దానికి ఆనుకొని ఉన్న ముసి ఏరు నుంచి కొంత మంది అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇలా అయితే ఏరు వచ్చే సమయంలో పొలాలు కొట్టుకుపోతాయని ఆమె అడిగారు. దీంతో మద్దులూరుకు చెందిన బొడ్డపాటి యల్లయ్య, మర్రిపూడి సుబ్బారావు, శిరీష అనే వ్యక్తులు అసభ్య పదజాలంతో తిట్టి, ఆమెపై దాడి చేశారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గేదెల అపహరణ ముఠా అరెస్టు: మేదరమెట్ల: దళారుల ముసుగులో గ్రామాల్లో గేదెలను అప హరిస్తున్న ముఠాను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేదరమెట్లకు చెందిన రేగుల నాగార్జున, తమ్మవర నికి చెందిన బట్టు గురుస్వామి గ్రామాల్లో రాత్రి వేళల్లో గేదెలను అపహరించి నల్గొండ జిల్లా మిర్యా లగూడ సంతలో విక్రయిస్తున్నారు. రెండు నెలల కాలంలో కొరిశపాడు, జె.పంగులూరు, నాగులుప్ప లపాడు, మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి మండలాల్లో గేదెలు పోయినట్లు 14 కేసులు నమోదయ్యాయి. పి.గుడిపాడు సమీపంలో అనుమానాస్పద రీతిలో సంచరిస్తున్న నిందితులను పట్టుకుని విచారించగా తాము చేసిన నేరాలు అంగీకరించారని డీఎస్పీ చెప్పారు.

కబ్జా గుప్పిట్లో.. దాతల భూములు

ఆక్రమణల్లో కుంటలు.. చెరువులు

కుంచించుకుపోయిన పాపరాజు కుంట

గ్రామాల్లో నీటి అవసరాలు తీర్చాలన్న సదాశయంతో దాత లందించిన భూములు కబ్జా గుప్పిట్లో చిక్కుకుంటున్నాయి. నీటి అవసరాలు తీర్చే నిమిత్తం కుంటలు, చెరువుల ఏర్పాటు కోసం వారు అందించిన భూముల్లో నేడు అక్రమార్కులు తిష్ఠ వేశారు. దీంతో అవి నానాటికీ కుంచించుకుపోతున్నాయి.

న్యూస్‌టుడే, మద్దిపాడు, సంతనూతలపాడు :

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నీటి వనరులు కబ్జాల్లో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్దిపాడు మండలంలోని రాచ వారిపాలెం- నాగన్నపాలెం రహదారిలో కడియాల వారి చెరువు కోసం దాతలు దాదాపు ఎనిమిది ఎకరాల భూమి ఇవ్వగా, దాదాపు మూడె కరాలు కబ్జాకు గురైంది. కీర్తిపాడు సర్వే నెం 72లో పాపరాజుకుంట ఏడెకరాల 20 సెంట్ల విస్తీర్ణంలో ఉండేది. అందులో కొంత భూమి కొందరికి పునరావాసం కింద ఇవ్వగా, మిగతా భూమి ఆక్రమణకు గురైంది. మద్దిపాడు మండల కేంద్రంలోని సర్వే నెం 201, 202లో మొత్తం అయిదెకరాల 17 సెంట్లలో ఉన్న ఆదెన్న చెరువు వేలమంది దాహార్తి తీర్చేది. ఇది కూడా ఆక్రమణల్లో చిక్కింది.

పేరుకే రెండొందల ఎకరాలు..

జిల్లా కేంద్రానికి శివారులో ఉన్న పేర్నమిట్ట సుమారు రెండొందల ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. గత అయిదేళ్లుగా వైకాపా పాలకులు నిర్వహణ విస్మరించడంతో ఆక్రమణదారులు పేట్రేగారు. మరోవైపు పూర్తిగా చిల్ల, రబ్బరు చెట్లతో అధ్వా నంగా మారింది. ఇష్టానుసారంగా అక్రమ మట్టి రవాణాతో చెరువు గర్భం చిద్రమైంది. చెరువును యథేచ్ఛగా ఆక్రమించి

చిల్ల, రబ్బరు చెట్లతో దర్శనమిస్తున్న పేర్నమిట్ట చెరువు

సాగు చేసుకుంటున్నా చర్యలు లేవు. చెరువు కట్టపై ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. ఇవి ఏటికేడు పెరుగుతున్నా నిలువ రించే దిశగా అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం. సాగర్ నీరు నేరుగా చెరువుకు వచ్చే అవకాశముంది. ఇందులో వంద ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేసి శివారుతో పాటు ఒంగోలుకు నీరందించా లన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. సర్వే చేసి భూము లను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో ికి రూ.లలో)



వెంకాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

వెలిగొండ సాధనకు మలిదశ పోరాటం

పామూరు, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయాలని మలిదశ పోరాటా నికి సిద్ధమవుతున్నామని, దీనిపై ఉద్యమ రూపకల్పనకు అక్టోబరు 8న మార్కాపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. పామూరులో డీవీ మనోహర్ భవ నంలో శుక్రవారం నుంచి జరుగు తున్న సీపీఐ జిల్లా శిక్షణ తరగతులు మూడోరోజు ఆదివారంతో ముగిశాయి. పాల కుల నిర్లక్ష్యం కారణంగా వెలిగొండ ప్రాజెక్టు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాలేదని ఆవే దన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ కనిగి రిలో నిమ్జ్, పారిశ్రామిక కారిడార్, ఒంగోలు పాల కేంద్రం తదతర సమస్యల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని పేర్కొన్నారు. దీనికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. భౌతికవాదం-భావవాదంపై ఆంధ్ర విశ్వవిద్యా లయం ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస్, కుల మత మూఢ విశ్వాసాలు-వాటి పర్యవ సానం-కమ్యూనిస్టుల అనే అంశంపై సారయ్య మాట్లాడారు.

మాట్లాడుతున్న సీపీఐ నేత ఈశ్వరయ్య. చిత్రంలో పార్టీ నాయకులు

బిందు సేద్యానికి పెద్దపీట

మార్కాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ సంవ త్సరం 30 వేల హెక్టార్లల్లో బిందు సేద్యం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ఆది వారం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు, పలు కంపెనీ లకు చెందిన డీలర్లు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీ, 5 నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న వారికి 70 శాతం రాయితీపై పరికరాలు అందిస్తు న్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 1,207 మంది రైతు లకు చెందిన 1,352 హెక్టార్లల్లో బిందు సేద్యం పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణ

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

TO LET

ఒంగోలు, బండ్లమిట్ట లంబాడి వీధిలో గం జాగర్లమూడి సుబ్బారావు కాంప్లెక్స్‌లో I, II, III ఫ్లోర్స్ (3200SFT ఒక్కో ఫ్లోర్) విద్యాసంస్థలకు, బ్యాంకులకు, హాస్టల్స్‌కు, కమర్షియల్స్ ఇవ్వబడును. ✆ 9441218690.

EDUCATION

DISTANCE EDUCATION

గీతం డిగ్రీ కాలేజి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆథరైజ్డ్ స్టడీ సెంటర్ నందు B.A, BBA, B.Com, B.LISc, MA (ALL), M.Com, MHRM, MSW కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సెల్ : 98491 24970.

JOBS

హైదరాబాద్ స్టార్ హోటల్స్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో బాయ్స్/ గర్ల్స్ కావలెను. రూమ్, ఫుడ్ బస్ పాస్ ఫ్రీ. శాలరీ: 16000-25000. Ph: 9550110629, 8466882075

హనీకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / షేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k. ✆ 96405 28899, 96406 46899.

FINANCIAL SERVICES

స్టాక్ మార్కెట్ బేసిక్స్ & ఇంట్రాడే ట్రేడింగ్ టెక్నికల్ ఎనాలసిస్ నేర్చుకోవాలి అని ఆసక్తి ఉన్నవారు Online & Offline Training కొరకు సంప్రదించగలరు. Ph: 7673915758

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / షేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. ✆ 85209 80099, 85208 74499.

REAL ESTATE

FACULTY/ TEACHERS

Wanted Teachers for 1st - 5th Classes at DEEPSIKA PUBLIC SCHOOL, Kakarla. Hostel Facility Available. సెల్: 80746 38228, 63038 12204.

SriVani Nikethan, Karavadi, Ongole(Mdl), Wanted Teachers 1st to 7th std to teach Eng, Maths & Science, P.M. Rs.20,000/- Cont: 9949217836.

LEASE

ఒంగోలు, దొడ్డవరప్పాడు, NH-5 ఆనుకొని, రిసార్ట్ షోరూం దగ్గర, హైవే సైడ్ పెంచర్ ఆనుకొని 75 సెంట్ల భూమి షోరూంలకు, హోటల్స్, గోడౌలకు లీజుకు ఇవ్వబడును. Cont: 9849115524.

CATERING

రాయపూర్ (ఛత్తీస్‌ఘడ్) ఊరులో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాన్ని బట్టి. సంప్రదించండి - 9425203443.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పం దించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిం దిగా పాఠకులకు సూచించడమై నది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందిం చిన సేవల విషయం లో తప్ప, ప్రక టనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్త ను బాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమా న్యానికే కలదు.

ఉపాధ్యాయుడి ఘరానా మోసం..

రూ.6.70 కోట్లకు కుచ్చుటోపి

కిషోర్‌కుమార్

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ఆయన ప్రభుత్వ ఉపా ధ్యాయుడు. గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ అక్రమ లాభార్జనే ధ్యేయంగా తోటి ఉపాధ్యాయులను, ప్రజలను మోసం చేసే మార్గాన్ని ఎంచుకున్నారు. నమ్మకంగా ఉండి చీటిపాటల నిర్వహణతో పాటు, అప్పులు తీసుకుని మోసం చేసి పరారైన సంఘటన బేస్తవారపేట మండ లంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలియ జేసిన వివరాల మేరకు... బేస్తవారపేటకు చెందిన ఐతా కిషోర్‌కుమార్ కొత్త మల్లాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా (స్కూల్ అసిస్టెంట్) పనిచేస్తు న్నారు. చీటిపాటలు, ప్లాట్ల వ్యాపారం పేరిట ఉపాధ్యాయులను, వ్యాపారస్తులను మోసం చేశారు. గత కొంతకాలంగా మెడికల్ లీవ్ పెట్టి భార్య, పిల్లలతో ఏడాది క్రితం సహ పరారయ్యారు.. దీంతో బాధితులు గత ఎస్సీ మల్లికార్జున్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ బేస్తవారపేట ఎస్సై నరసింహారావుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయా ల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో కిషోర్‌కుమా ర్‌పై చీటింగ్, చిట్ ఫండ్ కేసులు నమోదు చేసి అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆగస్టు 8న హైదరాబాద్‌లో ఉన్న ఐతా కిషోర్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసు కుని బేస్తవారపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి రిమాండ్ విధించారు. స్టేషన్‌లో పోలీసులు అతనిపై విచారణ చేపట్టగా దాదాపు రూ.6.70 కోట్ల మేర చీటి పాటలతో పాటు, పలువురి వద్ద అప్పు తీసుకుని మోసం చేసి పరారైనట్లు తెలిసింది. రిమాండ్ అనం తరం బెయిల్‌పై తిరిగి అతను హైదరాబాద్ వెళ్లిపో యారు. ఈయన నాడు-నేడు పనుల్లో కూడా చేతివాటం చూపినట్లు ఆరోపణలున్నాయి.

కానరాని వైద్య విద్యార్థి జాడ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లిలోని 'జలతరంగిణి' జలపా తంలో వైద్య విద్యార్థి గల్లంతై వారం రోజులైనా ఆచూకీ తెలియలేదు. సెప్టెంబర్ 22న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు మారేడుమిల్లి పర్యటక ప్రాంతానికి ప్రత్యేక వాహనంలో విహారయాత్రకు వచ్చారు. వీరిలో ముగ్గురు గల్లంతు కాగా, ఇద్దరి విద్యార్థినుల (బి.అమృత, కె.సౌమ్య) మృతదేహాలు మరుసటి రోజు వాగులో లభ్యమ య్యాయి. మార్కాపురానికి చెందిన మరో విద్యార్థి సీహెచ్.హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఆదివారానికి సరిగ్గా వారం రోజులు గడిచింది. గల్లం తైన రోజు నుంచి పోలీసు, రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని విపత్తు రక్షణ దళాలతోపాటు జాగిలాలు, డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నాయి. అయినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఆదివారం కూడా గాలింపు చర్యలు కొనసాగించారు.

ప్రహరీ విషయమై వివాదం

మర్రిపూడి: మండలంలోని రామాయపా లెంలో వైకాపా కార్యకర్త ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణానికి పిల్లర్ వేశారు. సీసీ రోడ్డు పక్కన కాలువ నిర్మించాలని, ప్రహరీ కొంచం లోపలికి కట్టుకోవాలని స్థానికులు సూచించారు. అతడు వినకుండా పిల్లర్ వేయ డంతో దానిని పడవేశారు. దీంతో వాదోపవా దాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు సర్దిచెప్ప టంతో వివాదం సద్దుమణిగింది.

తప్పిపోయిన చిన్నారులు క్షేమం

మద్దిపాడు: తప్పిపోయిన చిన్నా రులు ఎట్టకేలకు క్షేమంగా అమ్మమ్మ చెంతకు చేరిన సంఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరి ధిలో జరిగింది. చిన్నారుల తల్లిదండ్రుల కథనం ప్రకారం..బాతుల మేపుకుంటూ ఉపాధి పొందు తున్న లాజర్ దొడ్డపరప్పాడు వచ్చి అక్కడే పిల్ల లతో ఉంటున్నారు. శుక్రవారం ఆయన పనిమీద వేరే ప్రాంతానికి వెళుతూ ఇద్దరు పిల్లలు నాగ లూరి మహేష్, భూమికలను ఇంటివద్దే ఉంచారు. ఇంటి పక్కనున్న వ్యక్తికి చూడమని చెప్పి వెళ్లారు. ఆ తర్వాత పిల్లలి ద్దరూ రహదారి వెంట కిమ్స్ హాస్పిటల్ సమీపం నుంచి నడిచి వెళ్తుండగా గమనించిన ఆటో చోదకుడు ఎక్కడికి వెళ్లాలని అడిగితే పామూరు అని చెప్పారు. దీంతో ఆటోలో ఎక్కించుకుని సింగరాయకొండ బైపాస్‌లో దింపి రూ. 50 నగదు ఇచ్చి బస్సుకు వెళ్లిపోవాల్సిందిగా చెప్పారు. వారు అక్కడి నుంచి బస్‌లో కందుకూరు చేరుకుని బస్టాండ్‌లో ఉండగా, బంధువులు గుర్తించి పామూరులోని అమ్మమ్మ చెంతకు చేర్చ డంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ సమీ పంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో పి.సుప్రజ(32) అనే మహిళ ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు నగ రానికి చెందిన సుప్రజకు పదమూడేళ్ల క్రితం రవి అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ముగ్గురు మగపిల్లలు. అనంతరం భర్తను విడిచిపెట్టి ముస్నంగి నరేంద్ర అనే వ్యక్తితో గత ఆరేళ్లుగా సహజీనవం చేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం సుప్రజ, నరేంద్ర మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంటి లోపలి గదిల

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

పర్యటకాభివృద్ధికి కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తీరప్రాంతం, అటవీ, నదులు, దేవాలయాలను పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. వాకర్స్ మిత్రుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక భాగ్యనగర్‌లోని పార్క్ నందు ఆదివారం నూతనంగా నియమితులైన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీకు సన్మాన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, మంత్రులతో సమన్వయం చేసుకుంటూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపనున్నట్లు వివరించారు. భాగ్యనగర్‌లోని పార్క్ అభివృద్ధికి కూడా తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా పీడీ టి.రవికుమార్, సినీ కొరియోగ్రాఫర్ మద్దెల శ్రీను, ఎంఈవో నాగేంద్ర వదన్, బీటీపీ నాయకులు పర్రె వెంకటరావు, ఏఎస్పో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **యాదవ సంఘం నాయకులు : సంతనూతలపాడు, న్యూస్‌టుడే:** రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలజీని మండల యాదవ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెదేపా నాయకులు రావులపల్లి సురేష్, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నల్లగట్ల సుబ్బారావు, నల్లగట్ల శ్రీనివాస

బాలాజీను సన్మానిస్తున్న వాకర్స్ మిత్రుల అసోసియేషన్ ప్రతినిధులు

రావు, యాదవ సంఘం నాయకులు స్థానకాలు, బాపట్ల ఆంజనేయులు, బత్తుల సుబ్బారావు, బొడ్డు నాగార్జున, ప్రసాద్, బాలకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

● **మద్దిపాడు తెదేపా నాయకులు : మద్దిపాడు, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ప్రకాశం జిల్లా తెదేపా అధ్యక్షుడు నూకసాని బాలాజీని ఆదివారం మండల తెదేపా నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలులోని భాగ్యనగర్‌లో జిల్లా పార్టీ కార్యాలయంలో తెదేపా మండల మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, నవులూరి శివకృష్ణ, సుద్దపల్లి నరసింహారావు, సుద్దపల్లి సుబ్బారావు, వేల్పుల నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుండ్లకమ్మ జలాశయాన్ని ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం స్థాయి స్కూలు గేమ్స్ పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక భారత వ్యాయామ కళాశాలలో నిర్వహించారు. 40 మంది బాలికలు, 35 మంది బాలురు ఎంపికయ్యారు. కార్యక్రమానికి డీఎస్‌డీవో రాజరాజేశ్వరి, స్కూలు గేమ్స్ కార్యదర్శి వనజ, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, డాక్టర్ చాపల వంశీకృష్ణ హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ బాలికల జట్టుతో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

వరద బాధితులకు సాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు వ్యవసాయాధికారి పోతినేని వెంకటరావు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ఆదివారం ఈ మేరకు సదరు చెక్కును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఒంగోలులోని ఆయన నివాసంలో అందజేశారు.



ఎమ్మెల్యే దామచర్లకు చెక్కు అందజేస్తున్న పోతినేని వెంకటరావు

రహదారులు.. కమ్ముకున్న చీకట్లు

చీమకుర్తి, న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు, మద్దిపాడు

● వెలగని వీధి దీపాలు

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో రహదారులపై వీధి దీపాలు వెలుగు ఇవ్వడంలేదు. దీంతో ఆయా రహదారుల్లో ప్రయాణించాలంటే వాహన దారులు ఇక్కట్లకు గురవుతున్నారు. పాదచారులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. చీమకుర్తి మండలం గెలాక్సీపురిలో గుడ్డి దీపాలు మిణుకు మిణుకు మంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గెలాక్సీ గ్రానైట్ సీన రేజి నిధుల రూపంలో రాష్ట్రంలోనే అధిక ఆదాయం సమకూరే పురపాలక సంఘాల్లో చీమకుర్తి ఒకటిగా ఉంది. ప్రధానంగా పట్టణ ప్రధాన రహదారిలో విద్యుత్తు దీపాలు వెలుగులు సక్రమంగా వెలగక ప్రయాణికులు వాహనదారులు, ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో పడమర బైపాస్ కూడలి ప్రాంతం నుంచి గంగా లారీ కాటా వరకు రహదారికి ఇరువైపులా అనేక దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా తూర్పు వైపున హరిహర క్షేత్రం నుంచి పడమర బైపాస్ కూడలి వరకు రోడ్డుకు రెండు వైపులా దుకాణాలు ఉన్నాయి. పట్టణ ప్రధాన రహదారిలో రాత్రి 11 గంటల వరకు స్థానికులు రాక పోకలు సాగిస్తుంటారు. రహదారి అంచుల్లో విద్యుత్తు దీపాలు లేక పోవడంతో రాత్రి వేళల్లో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● మండల కేంద్రమైన మద్దిపాడులో జాతీయ రహదారి నుంచి ఎన్సీ హాస్టల్, అరుంధతి నగర్, జూనియర్ కళాశాలకు వెళ్ళు మార్గంలో వీధి విద్యుత్తు దీపాలు వెలగక పరిసర ప్రాంతాల్లో అంధకారం అలముకుంది.

● కొత్తపట్నం మండలం ఆలూరు ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలుగునివ్వడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో పాదచారులను వాహనాలు ఢీ కొనడంతో గాయలపాలవుతున్నారు. రాత్రి వేళ ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయం దోళనకు గురవుతున్నారు.

ఆలూరు గ్రామంలో ప్రధాన రహదారిలో పనిచేయని దీపాలు

● ఒంగోలు నుంచి కొత్తపట్నం వేళ్లే ప్రధాన రహదారి మార్గం కోప్పోలులో కొన్ని చోట్ల విద్యుత్తు దీపాలు పనిచేయక వాహనదారులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ కాలనీలో, వెంకటేశ్వర కాలనీల్లో కూడా వీధి దీపాలు పనిచేయడం లేదు. అధికారులు పట్టించుకోని విద్యుత్తు దీపాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చీమకుర్తి: పడమర బైపాస్ కూడలి నుంచి రామతీర్థం వైపు అంధకారంగా ఉన్న ఒంగోలు కర్నూలు రహదారి

మాల ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం నూతన కమిటీను ఆదివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.హనుమంతరావు(పీఆర్ ఏఈ), ప్రధాన కార్యదర్శి బి.గోపినాథ్, కార్యనిర్వహక అధ్యక్షుడిగా డి.థామస్, కార్యదర్శిగా యరమాల జనార్దన్, సంయుక్త కార్యదర్శిగా పి.వివేకానంద, ఉపాధ్యక్షులుగా కె.బాబురావు, కోశాధికారిగా యరమాల మల్లిఖార్జునరావుతోపాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల విజయశేఖర్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

మాల ఉద్యోగుల జిల్లా నూతన కమిటీ సభ్యులు

మైనంపాడులో బీపీసీఎల్ పనుల అడ్డగింత

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మండలంలోని మైనంపాడులో జరుగుతున్న బీపీసీఎల్ పనులను ఏపీ రైతు సంఘం నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావులు మాట్లాడుతూ.. రైతుల పొలాల్లో బీపీసీఎల్ పైపులు 16 మీటర్ల వెడల్పుతో వేస్తున్నారని కానీ నేటికీ ఆ విషయాన్ని రైతులకు చెప్పకపోవడం దారుణమన్నారు. రైతులకు నష్టపరిహారంగా సెంటుకు రూ.25వేలు ఇవ్వాలని, పరిహారం ఇవ్వకుండానే పనులు చేపడుతున్నారని ఆరోపించారు. పేర్నమిట్ట చెరువులో సైతం పైపులను పనులు చేపట్టకూడదని గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం, ఆయా కంపెనీ ప్రతినిధులు స్పందించి రైతులకు తగు న్యాయం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిలారి పెద్దబ్బాయి, అన్ను సుబ్బారావు, కె.హనుమంతరావు, బి.సుబ్బారావు, గుండవరపు రామయ్య, ఆళ్ల అంజయ్య, పాల్గొన్నారు.

పనులను అడ్డుకున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచించారు. ఆదివారం గద్దల గుంట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, సర్వ నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో ఒంగోలులోని 32వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు చాపల వంశీకృష్ణ, శాంతకుమారి పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

సమాజ చైతన్యానికి జాషువా రచనలు కీలకం

చీమకుర్తి, న్యూస్‌టుడే: కవి కోకిల గర్రం జాషువా జయంతి వేడుకలు చీమకుర్తిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్రిస్టియన్‌పాలెం సామాజిక భవనంలో జడ విజయ్ కుమార్ అధ్యక్ష తన వేడుకల్లో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో జిల్లా నాయకులు తొరటి ఆనంద్ మాదిగ, బొంతా యేసుదాసులు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో జాషువా రచనలు ఎంతో దోహదం చేశాయన్నారు. బి.సాల్మన్, బాబూరావు మాదిగ, కర్నా ప్రసాద్, బిరుదల లింగయ్య, పాటిబండ్ల బిక్షాలు, తాతిపూడి కొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనంద్ మాదిగ

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు ఎంపీడీవోగా కె.రాజశేఖర్ ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఒంగోలు వచ్చారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఇటీవల గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు నూతన ఎంపీడీవో రాజశేఖర్‌కు కార్యాలయ ఏవో శ్రీనివాసరెడ్డి, కొత్త పట్నం ఈవోఆర్డీ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

220 మందికి వైద్య పరీక్షలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో 20వ విడత ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ అధ్యక్షురాలు ఎస్.లతారెడ్డి, వైద్యులు దివి వరప్రసాద్, విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడిపై దాడి

ఒంగోలు నేరవిభాగం,: డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడిపై కొందరు యువకులు దాడి చేశారు. ఈ సంఘటన ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వైతు బజార్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు చిమటా చంద్రశేఖర్ అలియాస్ కన్నా ఆదివారం రాత్రి ఒక దుకాణానికి వెళ్లారు. అక్కడ ఒక సిగరెట్ కావాలని అడిగారు. సదరు బ్రాండ్ లేదని ఆ దుకాణంలో పనిచేసే యువకుడు చెప్పటంతో ఆయన ఆగ్రహించి అతడిపై దాడి చేశారు. బాధితుడి ద్వారా ఈ విషయం తెలుసుకున్న దుకాణ యజమాని కొందరు యువకులతో కన్నాపై దాడి దిగారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మన్నం సునీల్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగినట్లు గుర్తించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని కంభపాడులో బడ్డీకొట్టులో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిని సీఐ ఎం.సుబ్బారావు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు

ఇసుక టిప్పర్లు...

మద్దిపాడు, న్యూస్‌టుడే:: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్‌లను శనివారం అర్ధరాత్రి మద్దిపాడు పోలీసులు పట్టుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఎస్సై శివరామయ్య మైనింగ్ అధికారులకు సమాచారం అందించామన్నారు.

నగరేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: భాద్రపద మాసం బహుళ త్రయోదశిని, భాను ప్రదోషం, రవి ప్రదోషాలను పురస్కరించుకొని చీమకుర్తి హరిహర క్షేత్రంలోని నగరేశ్వర స్వామి, పార్వతీ దేవి అమ్మవార్లకు ప్రత్యేకంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భక్తులు నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

అలంకరణలో నగరేశ్వరుడు

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం ట్రస్టు ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్ సూచనలతో సంతనూతలపాడుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని నల్లగట్ల తులసికి రూ.10వేలు, మరోక కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలను, ఒక మూగ మహిళకు నిత్యవసరాల సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ ఛైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, కార్యదర్శి చివుకుల రామ్‌గోపాల్, జాయింట్ కార్యదర్శి కంకణంపాటి వెంకటేశ్వర్లు, రావులపల్లి సురేష్, ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, కురిచేటి రమేష్, శీలం మల్లారెడ్డి, షేక్ హజీరా బేగం పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛభారత్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి పర్యవేక్షణలో కార్యాలయంలో ఎన్నో ఏళ్ల నుంచి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. తహసీల్దార్ గది, రెవెన్యూ సిబ్బంది ఉండే ప్రదేశం, వీఆర్వోలు ఉండే గదులను, ఇలా కార్యాలయం మొత్తం శుభ్రం చేశారు.

పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సంర్భంగా బాలు కళాసమితి ఒంగోలు వారి ఆధ్వర్యంలో 'దొరకునా ఇటువంటి సేవ' పేరిట సంగీత విభావరి నిర్వహించారు. ఆదివారం స్థానిక సి.వి.యన్ రీడింగ్ రూమ్‌లో ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీబీ పాటలతో ఆయనకు నీరాజనం పలికారు. కార్యక్రమంలో అజయ్‌బాబు, గాయకులు కె.సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, జయరాజ్, పూర్ణ, గాయకులు రాజకుమారి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నేను తే.27-09-2024దీన ఉదయం సుమారు 12 గంటల సమయంలో ప్రకాశం జిల్లా, ఒంగోలు నగరంలోని జిల్లా కోర్ట్ ఆవరణలో గల స్టేట్ బ్యాంకుకు వెళ్ళి తిరిగి ద్విచక్ర వాహనంపై వచ్చుచుండగా కోర్ట్ సెంటర్‌లో నాకు మరియు ఒంగోలు నగర వాస్తవ్యులైన (1) షేక్ నాగూర్ వలి గారి కుమారుడు షేక్ మస్తాన్ మరియు (2) కమ్మ వీరాస్వామి గారి కుమారుడు కమ్మ వెంకటరావు గార్లకు జాయింటు హక్కు గల స్థిరాస్తికి సంబంధించిన మరియు ఒంగోలు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజులు అనగా దస్తావేజు నెం.3101/1993 రు (విక్రయ దస్తావేజు) మరియు దస్తావేజు నెం.774/1993 రు(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పత్రం) పోయినవి. కావున సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనాయూ దొరికిన యెడల క్రింది అడ్రసు నందు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు: **మేకల సురేష్‌రెడ్డి తండ్రి వెంకటేశ్వరరెడ్డి**
నర్సాపుర అగ్రహారం గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.99088 76115

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:

సమస్య: ఈదుమూడి గ్రామంలో చెరువులో నీటిని ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా శుద్ధి చేయకుండా నేరుగా గ్రామంలోకి సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. – **డేవిడ్, గ్రామస్థుడు**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతాం. – **మహాలక్ష్మి, ఎంపీడీవో**

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

మద్దిపాడు, న్యూస్‌టుడే

◆ అనుసంధాన రోడ్లలో ఇబ్బందులు

◆ పట్టించుకోని గత పాలకులు

గత వైకాపా పాలనలో రోడ్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణను కూడా గాలికొదిలేసింది. అసలే రోడ్ల పరిస్థితి అధ్వనంగా ఉన్నాయనుకుంటున్నా సామన్యులకు ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. మండలంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై నియంత్రణ లేకపోవడం వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఆపడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. మద్దిపాడులో జాతీయ రహదారి పైవంతెన కింద దుకాణాలు పెట్టడంతో వాహనాల రద్దీ పెరిగింది. గ్రోత్ సెంటర్‌లోని పారిశ్రామిక వాడలోని పరిశ్రమల వాహనాలు కార్మికుల కోసం పైవంతెన కింద వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది.

● వెల్లంపల్లి సెంటర్ మండలంలోని చాలా గ్రామాలకు అనుసంధానమై ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ కూడలిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు ఇష్టానుసారంగా తిరగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో అయితే ఇంటికి చేరుకోవడం గగనంగా మారుతోంది. ఇటీవల వెల్లంపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని అడ్డదిడ్డంగా వస్తున్న లారీ ఢీ కొని మరణించారు. ఇలాంటి సంఘటనలు తలెత్తకుండా ఉండాలంటే ట్రాఫిక్ నియంత్రణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● పారిశ్రామిక వాడ కూడలిలో అయితే ఏ వాహనాలు ఎటు వైపు నుంచి వస్తాయో అర్థం కాక భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం కార్మికులు పనులకు హాజరయ్యే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. హోటళ్లు, టీ దుకాణాల కోసం రోడ్డు పైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జాతీయ రహదారి పై తిరిగే వాహనాలే కాకుండా పారిశ్రామిక వాడ నుంచి వచ్చే వాహనాలు, బి.నిడమానూరు నుంచి వచ్చే వాహనాలతో ఆ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది.

● సీతారామపురం కోష్టాలలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇష్టానుసారంగా వాహనాలు నడపడం వల్ల ఇటీవల కాలంలో ఓ కారు అడ్డంగా ఆగిఉన్న వాహనాన్ని తప్పించబోయి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతులు ఢీ కొట్టాడు. ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.

మద్దిపాడు సర్వీస్ రోడ్డులో దుకాణాల ముందు ఆగిన ద్విచక్ర వాహనాలు

గ్రోత్ సెంటర్ రోడ్డులో ఆపిన లారీలు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మండలంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు తీరతాయని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతవాసుల కోరుతున్నారు.

(c) eenadu